

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం

26.07.2026
ఆదివారం |రంగారెడ్డి
సంపుటి : 01 | సంచిక: 26
పేజీలు : 08 | వెల: రూ.5

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.



# కేంద్ర విద్యాశాఖ మంత్రిగా ప్రహ్లాద్ జోషి

- విద్యా శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరణ
- మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం 2లో..

న్యూఢిల్లీ, జులై 25, అనంత జనశక్తి న్యూస్
నీట్ పేపర్ లీకేజీ వివాదం, జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు చేపట్టిన ఉద్ధృత పోరాటం దేశవ్యాప్తంగా కలకలం రేపాయి. ఈ నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. తాజాగా కేంద్ర విద్యాశాఖ బాధ్యతలను ప్రహ్లాద్ జోషీకి అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. నీట్ లీకేజీ వ్యవహారంలో సీజేపీ ఉద్యమం సంచలనంగా మారింది. విద్యాశాఖ మంత్రిగా ఉన్న ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్ లక్ష్యంగా విద్యార్థులు నిరసన చేపట్టారు. చివరకు ధర్యేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. ఈ రాజీనామాకు రాష్ట్రపతి ఆమోద ముద్ర పడింది.

# సత్తా చాటిన బొద్దింకలు

## కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

- నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై కాక్రోచ్ పార్టీ నిరసనలు
- దేశవ్యాప్తంగా రోడ్లపైకి వచ్చిన విద్యార్థులు
- తప్పనిసరి పరిస్థితుల్లో రాజీనామా
- ప్రధాని నరేంద్ర మోదీకి రిజైన్ లెటర్
- యువత ఆకాంక్షలను గౌరవిస్తున్న అని కామెంట్
- బాధ్యతల నుంచి నేను ఎప్పుడూ తప్పుకోలేదు
- యువశక్తే.. ఈ దేశ అసలైన శక్తి అని వ్యాఖ్య



**న్యూఢిల్లీ, జులై 25, అనంతజనశక్తి న్యూస్**

నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై దేశవ్యాప్తంగా విద్యార్థుల ఆందోళనలు కొనసాగుతున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను ప్రధాని నరేంద్ర మోదీకి పంపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో సుదీర్ఘ పోస్టు పెట్టారు. ఈ సందర్భంగా ప్రధాన్ స్పందిస్తూ.. యువత ఆకాంక్షలను తాను గౌరవిస్తున్నట్లు తెలిపారు. 'గత పది రోజులుగా జరుగుతున్న పరిణామాలు నన్ను బాధించాయి. నేను వ్యక్తిగత భేషజాలకు పోవడం లేదు. నీట్ అక్రమాలు వెలుగులోకి రాగానే.. సీబీఐ విచారణకు ఆదేశించాం. విజయవంతంగా మళ్లీ పరీక్షను నిర్వహించాం. బాధ్యతల నుంచి నేను ఎప్పుడూ తప్పుకోలేదు. యువశక్తే.. ఈ దేశ అసలైన శక్తి. వారి భవిష్యత్తు కోసమే రాజీనామా చేశాను. దేశ యువతపై నాకు పూర్తి నమ్మకం ఉంది. వారి ఆకాంక్షలను గౌరవిస్తున్నా. దేశ విద్రోహ శక్తులకు అవకాశం ఇవ్వకూడదనే రాజీనామా నిర్ణయం తీసుకున్నా. దేశ సేవ నా అత్యున్నత ప్రాధాన్యత. దేశ ఐక్యత కొనసాగాలి. యువత తమ చదువుల కోసమే సమయం కేటాయించాలి. మంత్రిగా ఇన్నాళ్లు నాకు అవకాశం కల్పించిన మోదీకి కృతజ్ఞతలు'' అని ధర్మేంద్ర ప్రధాన్ తన లేఖలో పేర్కొన్నారు.

## కేంద్రానికి యువత గుణపాఠం చెప్పింది

ప్రియాంక గాంధీ


5లో..

# ఇది ఫస్ట్ వికెట్ మాత్రమే

- సీజేపీ సంచలనం
- ప్రధాన్ రాజీనామాతో ఆగదా..?
- "విద్యార్థి శక్తి వర్ధిల్లాలి" అంటూ ఎక్స్‌లో పోస్టు
- కేంద్రానికి మా సత్తా చూపించాం
- 3 డిమాండ్లు కేంద్రం అంగీకరించింది
- ఆందోళన విరమించినట్లుగా సీజేపీ ప్రకటన 2లో..



**న్యూఢిల్లీ, జులై 25, అనంతజనశక్తి న్యూస్**

కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) స్పందించింది. కేంద్రానికి తమ సత్తా ఏంటో చూపించామని, ప్రజాస్వామ్యం గెలిచిందని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే అన్నారు. విద్యార్థుల శక్తి ఇలాగే కొనసాగాలని ఆయన వ్యాఖ్యానించారు. నీట్ పేపర్ లీక్ కారణంగా ఆత్మహత్యకు పాల్పడిన విద్యార్థుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం అందజేయాలని కోరారు. విద్యార్థులపై లాఠీఛార్జ్ చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని దీప్కే డిమాండ్ చేశారు.

# మోడీ సారీ చెప్పాల్సిందే..

- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కీలక అడుగు
- రాహుల్ గాంధీ కామెంట్
- వీడియో సందేశంలో ప్రతిపక్ష నేత డిమాండ్

న్యూఢిల్లీ, జులై 25, అనంతజనశక్తి న్యూస్
కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. ఇది కేవలం ప్రతీకాత్మకమైన రాజీనామా అయినప్పటికీ.. దేశ విద్యా వ్యవస్థ పునర్నిర్మాణానికి కీలక అడుగుగా అభివర్ణించారు. విద్యార్థులపై బలప్రయోగానికి పాల్పడిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రధాని నరేంద్ర మోడీ విద్యార్థులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. 2లో..

# ముగిసిన సర్

- 44 లక్షలకుపైగా ఓటర్లు అన్‌కలెక్టబుల్
- 31న ముసాయిదా జాబితా
- ఓటర్ల శాతం 10.74 శాతం



2లో..

# ఇది ప్రజాస్వామ్య విజయం

- కేంద్రమంత్రి రాజీనామాపై సోనమ్ వాంగ్‌చుక్
- ఆస్పత్రి బెడ్‌పై నుంచి విక్టరీ సైన్‌తో ఫొటో షేర్

**న్యూఢిల్లీ, జులై 25, అనంతజనశక్తి న్యూస్**

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్ తొలిసారిగా స్పందించారు. ''ఇది ప్రజాస్వామ్య విజయం'' అంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు. జూన్ 28న కాక్‌రోచ్ జనతా పార్టీ చేపట్టిన నిరసనకు మద్దతుగా సోనం వాంగ్‌చుక్ నిరాహార దీక్ష ప్రారంభించారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై పార్లమెంట్‌లో చర్చ, నిరసన తెలిపిన విద్యార్థులపై ఎలాంటి కేసులు ఉండబోవనే హామీ, నీట్ వివాదం నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు పరిహారం అంశాలపై కేంద్రం హామీ ఇవ్వడంతో ఆయన 26 రోజుల నిరాహారదీక్షను గురువారం విరమించారు.


2లో..

# ట్యాంక్‌బండ్‌పై క్యాండిల్ ర్యాలీ

- మోడీ తలవంచారన్న రేవంత్!
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై స్పందన
- 21 ఏళ్లకే ఎమ్మెల్యే పోటీకి తీర్మానం
- జెన్-జీకి విద్యాశాఖ మంత్రి హామీ 2లో..



**హైదరాబాద్, జులై 25, అనంతజనశక్తి న్యూస్**

దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత సాధించిన చారిత్రాత్మక విజయానికి మద్దతుగా, ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన విద్యార్థులకు నివాళులు అర్పిస్తూ హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఇందిరా గాంధీ విగ్రహం సాక్షిగా సాగిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ప్రచారం కమిటీ ఛైర్మన్ మధుయాష్కీ గౌడ్ , పలువురు రాష్ట్ర మంత్రులు పాల్గొన్నారు.

## బటన్ నొక్కితే ఓట్లు రావు

- పనులు చేస్తేనే వస్తాయి
- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని


2లో..

## ఎర్రచందనం స్మగ్లింగ్‌కు సహకరిస్తే ఉపేక్షించం

- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్
- స్మగ్లింగ్ నిరోధానికి ఆపరేషన్ అరణ్య 2లో..



# ఆధార్ ఒక్కటి ఉంటే సరిపోతుంది

- ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులకు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- అర్హతలు, దరఖాస్తు విధానంపై స్పష్టత
- ఇతర పత్రాలు అవసరం లేదని వెల్లడి

**హైదరాబాద్, జులై 25, అనంతజనశక్తి న్యూస్**

ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులకు ఆధార్ ఒక్కటే సరిపోతుందని, ఇతర పత్రాలు అవసరం లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అర్హతలు, దరఖాస్తు విధానంపై స్పష్టత ఇచ్చారు. ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల ప్రక్రియపై మంత్రి కీలక వివరాలు వెల్లడించారు. 2లో..





## ఇస్రో మిషన్ శక్తి శాట్ కి ఎంపికైన కందుల జెస్సీకి ల్యాప్ టాప్, పుస్తకాల బహూకరణ

**ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో అందజేసిన కౌడా ఛైర్మన్ తలాటం సత్య**

**విజయవాడ జూలై 25 అనంత జనశక్తి న్యూస్**

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న మిషన్ శక్తి శాట్ కి ఎంపికైన తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరం బాలికోన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని కందుల జెస్సీకి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి వర్యులు పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో కాకినాడ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ ఛైర్మన్ తలాటం సత్య కొత్త ల్యాప్ టాప్ ను అందజేశారు. నూతన ల్యాప్ టాప్ తో పాటు అంతరిక్ష శాస్త్రానికి సంబంధించిన పుస్తకాలు, బ్యాగ్, చాక్లెట్లు అందజేసి, భవిష్యత్ పరిశోధనలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. అంతర్జాతీయ శాస్త్రవేత్తలను మెప్పించిన జెస్సీ ప్రతిభకు ముగ్ధులైన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సందేశం నుంచి స్ఫూర్తి పొందిన సత్య ఆమె ప్రతిభకు మరింత సాన బెట్టేందుకు అవసరమైన ల్యాప్ టాప్, పుస్తకాలు అందజేయాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. ఇప్పటికే ఎక్స్ వేదికగా కందుల జెస్సీకి శుభాకాంక్షలు తెలిపిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఆమెకు తనవంతు సహాయం అందించిన కౌడ ఛైర్మన్ తలాటం సత్యను అభినందించారు. జెస్సీకి ల్యాప్ టాప్ అందించిన వారిలో జనసేన నేతలు అత్తి సత్యనారాయణ, గంటా స్వరూప, యెడ్ల మహేష్ తదితరులు ఉన్నారు.

## ముగిసిన సర్

**అమరావతి , జులై 25, అనంతజనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా నిర్వహించిన సమగ్ర ఓటర్ల సవరణ ప్రక్రియలో కీలక దశ పూర్తయింది. ఈ ప్రక్రియకు సంబంధించి డిజిటలైజేషన్ పనులన్నింటినీ అధికారులు క్షేత్రస్థాయిలో పూర్తి చేశారు. ఈ సవరణల ఆధారంగా రూపొందించే కొత్త ఓటర్ల జాబితా విడుదలపై ఎన్నికల సంఘం పలు వివరాలను వెల్లడించింది.
ఏపీలోని మొత్తం ఓటర్ల సంఖ్యలో 44,71,523 మందిని 'అన్‌కలెక్టబుల్' ఓటర్లుగా అధికారులు గుర్తించారు. స్థానికంగా అందుబాటులో లేకపోవడం, చిరునామా మారడం లేదా మరణించడం వంటి వివిధ సాంకేతిక, క్షేత్రస్థాయి కారణాలతో వీరిని ఈ జాబితాలో చేర్చారు. రాష్ట్రంలోని మొత్తం ఓటర్ల సంఖ్యతో పోల్చి చూస్తే.... ఈ అన్‌కలెక్టబుల్ ఓటర్ల శాతం ఏకంగా 10.74 శాతంగా నమోదుగా ఉంది. వీటిలో అత్యధిక వాటా మరణించిన ఓటర్లదే. వీరి సంఖ్య 15,19,558 (3.65శాతం)గా గుర్తించారు. అన్‌కలెక్టబుల్ ఓటర్ల సంఖ్య అత్యధికంగా శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో ఉన్నట్లు లెక్కలు సూచిస్తున్నాయి. ఆ తర్వాత స్థానాల్లో తిరుపతి, కడప, విశాఖ గుంటూరు ఉన్నాయి. ఇవే కాకుండా మిగిలిన జిల్లాల్లోనూ కొన్ని ఓట్లు తొలగించాల్సిన జాబితాలో ఉన్నాయి. సవరించిన వివరాల ఆధారంగా ఓటర్ల ముసాయిదా జాబితాను ఈ నెల 31వ తేదీన అధికారికంగా విడుదల చేయడానికి ఎన్నికల యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. ఈ ముసాయిదా జాబితా వెలువడిన తర్వాత.... అభ్యంతరాలు లేదా సవరణలు ఉంటే దరఖాస్తు చేసుకోవడానికి అభ్యర్థులకు తగిన సమయాన్ని కేటాయిస్తారు. ఆపై క్షేత్రస్థాయి పరిశీలనలు.... వచ్చిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిష్కరించిన తర్వాత, అక్టోబర్ 3వ తేదీన ఓటర్ల తుది జాబితాను ఎన్నికల సంఘం విడుదల చేయనుంది. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ: 31.07.2026న ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేస్తారు. అభ్యంతరాలు, క్లెయిమ్‌ల దాఖలు : కొత్త ఓటర్ల నమోదు, మార్పులపై అభ్యంతరాలు, క్లెయిమ్‌లను సమర్పించడానికి 31.07.2026 నుండి 30.08.2026 వరకు సమయం ఉంటుంది. నోటీసుల దశ / క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారం: సమర్పించిన అభ్యంతరాల పరిశీలన, పరిష్కార ప్రక్రియను 31.07.2026 నుండి 28.09.2026 వరకు చేపడతారు.తుది ఓటర్ల జాబితా ప్రచురణ : అన్ని సవరణలు పూర్తి చేసిన అనంతరం తుది ఓటర్ల జాబితాను 03.10.2026న అధికారికంగా ప్రచురిస్తారు.

## మోడీ సారీ చెప్పాల్సిందే..

(మొదటి పేజీ తరువాయి)

శనివారం విడుదల చేసిన వీడియో సందేశంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. ''ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశ విద్యా వ్యవస్థ పునర్నిర్మాణంలో ఒక పెద్ద అడుగు. ఆయన ఒక ప్రతీక మాత్రమే. అందుకే ఇది ప్రతీకాత్మక నిర్ణయమే అయినప్పటికీ చాలా ముఖ్యమైనది.'' అని అన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు విద్యార్థుల నిరంతర ఆందోళనలే కారణమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం, దేశ భవిష్యత్తు, రాజ్యాంగ పరిరక్షణ కోసం వీధుల్లోకి వచ్చి పోరాడిన ప్రతి విద్యార్థికి అభినందనలు తెలిపారు. ''వీధుల్లోకి వచ్చి ప్రజాస్వామ్యం కోసం, దేశ భవిష్యత్తు కోసం, రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడిన ప్రతి విద్యార్థికి నా అభినందనలు. మీపై నాకు గర్వంగా ఉంది.'' అని అన్నారు. ఈ రాజీనామా రైతులు, కార్మికులు, పేదలు సహా కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రతి వర్గానికి ఒక సందేశమని పేర్కొన్నారు. ''ఈ ప్రభుత్వం అణచివేతకు గురిచేస్తున్న ప్రతి వర్గం ధైర్యంగా పోరాడితే మార్పు సాధ్యమవుతుందని ఈ పరిణామం నిరూపించింది. దేశ రాజ్యాంగాన్ని బలహీనపరుస్తూ, సంస్థలను తన ఆధీనంలోకి తీసుకుంటున్న ఈ ప్రభుత్వాన్ని ప్రజలు ఎదుర్కోవాలి.'' అని వ్యాఖ్యానించారు.
కేంద్ర ప్రభుత్వం ఇంకా రెండు కీలక డిమాండ్లను నెరవేర్చాల్సి ఉందన్నారు. విద్యార్థులపై లాఠీచార్జ్, కాల్పులు, బలప్రయోగానికి పాల్పడిన అధికారులు, వాటిని ఆదేశించిన వారందరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ''విద్యార్థులపై చేయి చేసుకున్నవారు, వారిని కొట్టినవారు, కాల్పులకు పాల్పడినవారు, ఈ చర్యలను ప్రణాళికాబద్ధంగా అమలు చేసిన ప్రతి ఒక్కరినీ బాధ్యులుగా నిలబెట్టి శిక్షించాలి.'' అని కోరారు.
మోడీ క్షమాపణ చెప్పాలి
దేశ విద్యార్థుల పట్ల గౌరవం చూపిస్తూ ప్రధాని మోడీ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ''దేశ భవిష్యత్తైన విద్యార్థులపై జరిగిన అమానుష దాడులకు ప్రధాని మోడీ క్షమాపణ చెప్పాలి. విద్యార్థులపై జరిగిన దాడులకు ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలి.'' అని పేర్కొన్నారు.

## ఇది ప్రజాస్వామ్య విజయం

(మొదటిపేజీ తరువాయి)

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత ఆయన విక్టరీ సింబర్ చూపుతూ ఉన్న ఫోటోను పోస్ట్ చేశారు. ''వీధుల నుంచే ప్రత్యక్ష ప్రజాస్వామ్యం, ఇది శాంతి, సహనం, పట్టుదల సాధించిన విజయం'' అని ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. కాక్రోచ్ జనతా పార్టీ, దేశ యువతకు ఆయన అభినందనలు తెలిపారు. భయాన్ని వీడి ఉద్యమంలో పాల్గొన్న ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో ఇకపై ఉద్యమం జవాబుదారీతనం, విద్యాసంస్కరణల దిశగా ముందుకు సాగుతుందని అన్నారు.

## కేంద్ర విద్యాశాఖ మంత్రిగా ప్రహ్లాద్ జోషి

(మొదటి పేజీ తరువాయి)

ధర్మేంద్ర ప్రధాన్ సమర్పించిన రాజీనామా లేఖను ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిపాదన మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించారు. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ అధికారిక ప్రకటన విడుదల చేసింది.
ధర్మేంద్ర ప్రధాన్ తప్పుకోవడంతో ఖాళీ అయిన విద్యాశాఖ బాధ్యతలను కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి కి అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ప్రధాని మోదీ సూచన మేరకు తన పాత మంత్రిత్వ శాఖలతో పాటు విద్యా శాఖ అదనపు బాధ్యతలను ప్రహ్లాద్ జోషికి కేటాయిస్తున్నట్లు రాష్ట్రపతి భవన్ తన ప్రకటనలో తెలిపింది.
ప్రహ్లాద్ వెంకటేష్ జోషి ప్రస్తుతం కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ శాఖలతో పాటు నూతన, పునరుత్పాదక ఇంధన వనరుల శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. 2024 లో ప్రధాని మోదీ మంత్రివర్గంలోకి మళ్లీ ఎన్నికైన ఈ సీనియర్ నాయకుడికి.. ఇప్పుడు అత్యంత కీలకమైన విద్యాశాఖ అదనపు బాధ్యతలను కట్టబెట్టారు.
తదుపరి సవాళ్లు
మంత్రిత్వ శాఖలో అనూహ్యంగా జరిగిన ఈ మార్పు భారత విద్యా వ్యవస్థలో సంస్కరణలకు ప్రాధాన్యతనిచ్చేలా కనిపిస్తోంది. నూతన బాధ్యతలు స్వీకరించిన ప్రహ్లాద్ జోషి ముందు ప్రస్తుతం అనేక కీలక సవాళ్లు ఉన్నాయి. ముఖ్యంగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వ్యవస్థను ప్రక్షాళన చేయడం, రద్దయిన ప్రవేశ పరీక్షలను పారదర్శకంగా తిరిగి నిర్వహించడం, బాధితులైన కోట్లాది మంది విద్యార్థులలో నమ్మకాన్ని పునరుద్ధరించడం వంటి అంశాలు ప్రహ్లాద్ జోషి ముందు ఉన్నాయి.
నిరసన విరమణ
ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, విద్యార్థులపై కేసులు ఎత్తివేయడానికి కేంద్రం ఒప్పుకోవడంతో ఉద్యమాన్ని సీజేపీ నిలిపివేసింది. నిరసన విరమించింది. ఏదేమైనా తమ డిమాండ్ల సాధన కోసం విద్యార్థులు చేసిన ఈ ఉద్యమం భారత రాజకీయ చరిత్రలో ప్రత్యేకంగా నిలిచిపోనుంది.

## ట్యాంక్‌బండ్‌పై క్యాండిల్ ర్యాలీ

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల ఉత్సాహం, వారి ముఖాల్లోని విజయదరహాసం దేశ భవిష్యత్తుకు శుభసూచకమని కొనియాడారు.
దేశ యువత విజయం.. కాంగ్రెస్ ఖాతాలో వేసుకోం
కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం అనేది పూర్తిగా దేశ యువత సాధించిన విజయమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ చారిత్రాత్మక విజయాన్ని కాంగ్రెస్ పార్టీ తన ఖాతాలో వేసుకోవాలని అనుకోవడం లేదని తెలిపారు. రాజకీయ పార్టీలకు అతీతంగా విద్యార్థులు సాగించిన ఐక్య పోరాటానికి అన్ని పక్షాల మద్దతు లభించిందని, అందుకే కేంద్ర ప్రభుత్వం దిగొచ్చి రాజీనామా ఆమోదించక తప్పలేదని అన్నారు. అయితే, కేవలం ఒక రాజీనామాతో సరిపెట్టకుండా ఉద్యమంలో చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు కేంద్రం తక్షణమే భారీ నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యార్థులపై బనాయించిన అక్రమ కేసులను వచ్చే సోమవారం లోపు తక్షణమే ఎత్తివేయాలని కోరారు.
21 ఏళ్లకే ఎమ్మెల్యే పోటీకి అర్హత: అసెంబ్లీలో ప్రత్యేక తీర్మానం
రాబోయే రోజుల్లో దేశ భవిష్యత్తును నిర్ణయించే బాధ్యత యువతదేనని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. నాడు రాజీవ్ గాంధీ 61వ రాజ్యాంగ సవరణ ద్వారా 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించారని గుర్తుచేశారు. "21 ఏళ్లకే మేయర్ కావచ్చు, ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు కావచ్చు.. డిజిపి సి.వి. ఆనంద్ 22 ఏళ్లకే ఐపీఎస్ అయ్యారు. అలాంటప్పుడు చట్టసభల్లోకి ఎందుకు రాకూడదు?" అని ప్రశ్నించారు. వచ్చే ఆగస్టు మొదటి వారంలో ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేసి, 21 ఏళ్లకే యువత ఎమ్మెల్యేగా పోటీ చేసేలా చట్ట సవరణ కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేసి ప్రధాని మోడీకి పంపుతామని హామీ ఇచ్చారు. 21 ఏళ్ల యువకుడు కేంద్రంలో మంత్రి అయితే దేశం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు.
ఇన్ని ట్యాక్టిక్లను లొంగదీసుకున్నారు.. కానీ జెన్‌జీ భయపడలేదు ఇడి , సీబీఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉపయోగించి రాజకీయ నాయకులను లొంగదీసుకున్న నరేంద్ర మోడీ ప్రభుత్వం, జెన్‌జీ యువతపై కూడా లాఠీలు ఝులిపించిందని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. కానీ యువత అదరక, బెదరక గుండె ధైర్యంతో ఎదురొడ్డి పోరాడి మోడీ అహంకారాన్ని ఓడించిందని అన్నారు. జంతర్ మంతర్ వద్ద మొదలైన ఈ జెన్‌జీ సునామీ ఇక్కడితో ఆగకూడదని, వారి గొంతుక చట్టసభల్లో మోగాలని ఆకాంక్షించారు. రాబోయే రోజుల్లో దేశానికి రాహుల్ గాంధీ ప్రధాని అవుతారని, ఆయన క్యాబినెట్‌లో విద్యాశాఖ మంత్రి బాధ్యతను జెన్‌జీ ప్రతినిధికే అప్పగించేలా ఇండియా కూటమితో తాను మాట్లాడి ఒప్పిస్తానని ఇందిరమ్మ విగ్రహం ముందు సీఎం రేవంత్ రెడ్డి మాట ఇచ్చారు. విద్యార్థుల పోరాటం ఫలితంగానే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జీని ఖండిస్తూ పీపుల్స్ ప్లాజా నుంచి ఇందిరా గాంధీ విగ్రహం వరకూ క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ విద్యార్థులపై నమోదైన కేసులను వెంటనే తొలగించాలని, వారి విజయాన్ని కాంగ్రెస్ ఖాతాలో వేసుకోబోమని స్పష్టం చేశారు. విద్యార్థులపై పెట్టిన కేసులను వెంటనే తొలగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పార్లమెంట్‌లో కాంగ్రెస్ ఎంపీలంతా ఇదే నినాదాన్ని వినిపించాలని సూచించారు. విద్యార్థుల పోరాటం వల్లే కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేశారని, ఇది యువత సాధించిన విజయమని అన్నారు. విద్యార్థుల మొహాల్లో కనిపిస్తున్న ఆనందమే అసలైన విజయమని సీఎం రేవంత్ పేర్కొన్నారు. చప్పన్ ఇంచ్ ఛాతీ అంటూ గొప్పలు చెప్పుకునే నాయకత్వం.. దేశ యువత ముందు ఓడిపోయిందని విమర్శించారు. అయితే విద్యార్థులపై నమోదైన కేసులు ఇంకా తొలగించలేదని, వెంటనే వాటిని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. నీట్ కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పరామర్శించలేదని ఆరోపించారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించే వరకూ వారి తరఫున కాంగ్రెస్ పోరాటం కొనసాగిస్తుందని సీఎం స్పష్టం చేశారు. విద్యార్థుల పోరాటానికి కేంద్ర ప్రభుత్వం దిగివచ్చిందని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. కేంద్రం మెడలు వంచినందుకే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారని పేర్కొన్నారు. మోదీ చరిష్మా తగ్గిందని, ఆయన చర్యలను ప్రపంచం ఖండించిందని వ్యాఖ్యానించారు. జెన్ జీ యువతకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలని మహేష్ గౌడ్ అన్నారు. 21 ఏళ్లకే చట్టసభల్లోకి వచ్చే అవకాశం కల్పించేలా చట్టం తీసుకురావాలని, ఈ మార్పును తెలంగాణ నుంచే ప్రారంభిస్తామని తెలిపారు.

## ఆధార్ ఒక్కటి ఉంటే సరిపోతుంది

(మొదటిపేజీ తరువాయి)

ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ కాల్ సెంటర్ సేవలు అందుబాటులో ఉంటాయని.. తెలుగు, హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో సమాచారం పొందవచ్చని తెలిపారు. దరఖాస్తు సమయంలో ఆధార్ ఒక్కటి ఉంటే సరిపోతుందని, ఇతర పత్రాలు అవసరం లేదన్నారు. రూ.10 వేల ఈఎండీని యూపీఐ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లించాల్సి ఉంటుందని, ఇల్లు రాని వారికి అదే ఖాతాలో ఈఎండీ మొత్తాన్ని తిరిగి చెల్లిస్తామని చెప్పారు. క్యూఆర్ పరిధిలో 10 ఏళ్ల నివాసం, కుటుంబ వార్షిక ఆదాయం రూ.6 లక్షల లోపు ఉండటం అర్హతలుగా పేర్కొన్నారు. ఒక కుటుంబానికి ఒక దరఖాస్తు, ఒక ఫ్లాట్ మాత్రమే కేటాయిస్తామని తెలిపారు. సొంత ఇల్లు లేదా ఫ్లాట్ ఉన్నవారికి అర్హత ఉండదని, అర్హులు ఎక్కువైతే లాటరీ పద్ధతిలో కేటాయింపు చేస్తామని వెల్లడించారు. ఫ్లాట్ ధర రూ.40 నుంచి రూ.60 లక్షల వరకు ఉండగా, ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీ అందిస్తుందని, లబ్ధిదారుడు రూ.6 లక్షలు మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని మంత్రి తెలిపారు.
క్యూర్ పరిధిలో నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్స్ గృహాల కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక హెల్ప్‌లైన్‌ను ప్రారంభించింది. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి 04024603572 హెల్ప్‌లైన్‌ను ప్రారంభించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ కాల్ సెంటర్ సేవలు అందుబాటులో ఉంటాయని మంత్రి తెలిపారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో దరఖాస్తుదారులకు సమాచారం అందించనున్నారు. దరఖాస్తు ప్రక్రియను సులభతరం చేస్తూ, ఆధార్ కార్డు ఒక్కటే సరిపోతుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. దరఖాస్తు సమయంలో ఇతర పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదని తెలిపారు. అయితే, రూ.10 వేల ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ ను యూపీఐ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఒకవేళ ఫ్లాట్ కేటాయించకపోతే అదే బ్యాంకు ఖాతాకు ఈ మొత్తం తిరిగి జమ చేయనున్నట్లు వెల్లడించారు. క్యూర్ పరిధిలో కనీసం 10 సంవత్సరాలు నివాసం ఉండాలని మంత్రి తెలిపారు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.6 లక్షల లోపు ఉండాలన్నారు. ఒక కుటుంబం నుంచి ఒకే దరఖాస్తు మాత్రమే స్వీకరిస్తారని పేర్కొన్నారు. అలాగే క్యూర్ లేదా ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో ఇప్పటికే సొంత ఇల్లు లేదా స్థలం ఉన్న వారు ఈ పథకానికి అర్హులు కాదని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. అర్హుల సంఖ్య అందుబాటులో ఉన్న ఫ్లాట్ల కంటే ఎక్కువగా ఉంటే లాటరీ విధానంలో కేటాయింపులు చేపడతారని తెలిపారు. ఇందిరమ్మ టవర్స్‌లో ఫ్లాట్ ధర రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు ఉండగా, ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీ అందిస్తుందని స్పష్టం చేశారు. మిగిలిన మొత్తంలో లబ్ధిదారుడు తన వాటాగా రూ.6 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని మంత్రి పొంగులేటి తెలిపారు.

## బటన్ నొక్కితే ఓట్లు రావు

**అమరావతి,. జులై 25, అనంతజనశక్తి న్యూస్**

బటన్ నొక్కితే ఓట్లు రావు.. పనులు చేస్తేనే వస్తాయని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు జిల్లాకు శాశ్వత మంచినీటి అభివృద్ధి లక్ష్యంగా చేపట్టిన అమృత్ 2.0 పథకం పనులకు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ, ఎమ్మెల్యేలు కలిసి పైలాన్‌ను ఆవిష్కరించారు. అమృత్ 2.0 పనులతో 50 ఏళ్లకు నీటి సమస్య ఉండదని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ.. ఎంపీ నిధుల ద్వారా ఏడాదికి రూ.5 కోట్లు వస్తాయని, మరో రాజ్యసభ సభ్యుడు ఉండటంతో అదనంగా మరో రూ.5 కోట్లు అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. రాష్ట్ర విభజన తర్వాత గుంటూరు జనాభా 8 లక్షలు ఉండగా ప్రస్తుతం 11 లక్షలకు చేరిందని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా తాగునీటి అవసరాలు పెరిగాయని చెప్పారు. కృష్ణా నది నుంచి తక్కెళ్లపాడు వరకు రూ.400 కోట్లతో పైప్‌లైన్ల ఆధునికీకరణ చేపట్టి 90 నుంచి 130 ఎంఎల్‌డీ నీటి సరఫరా అందిస్తున్నామని, ఇంకా 35 ఎంఎల్‌డీ నీటి అవసరం ఉందన్నారు.
2019కి ముందు గుంటూరు నీటి సమస్య పరిష్కారానికి రూ.160 కోట్లు మంజూరు చేసిన ఘనత చంద్రబాబు ప్రభుత్వానిదని పెమ్మసాని అన్నారు. అయితే ప్రభుత్వం మారిన తర్వాత ఆ నిధుల్లో ఒక్క రూపాయి కూడా వినియోగించలేదని ఆరోపించారు. ఈ అంశంపై వైసీపీ నాయకులతో చర్చకు సిద్ధమని సవాల్ చేశారు. తక్కెళ్లపాడులో మరో 50 ఎంఎల్‌డీ నీటి కోసం రిజర్వాయర్ నిర్మిస్తున్నామని, రూ.577 కోట్లతో రింగ్ రోడ్డు పైప్‌లైన్ పనులు చేపడుతున్నామని తెలిపారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే విలీన గ్రామాలకు వచ్చే 50 ఏళ్ల వరకు నీటి సమస్య ఉండదని పేర్కొన్నారు. నాయకులు మారినా ప్రజల ఇళ్లలో నీటి సరఫరా ఆగకుండా శాశ్వత పరిష్కారాలు కల్పిస్తున్నామని, బటన్ నొక్కడం ద్వారా కాకుండా ప్రజలకు అవసరమైన రోడ్లు, నీరు వంటి మౌలిక వసతులు కల్పించడం ద్వారానే ప్రజల మద్దతు లభిస్తుందని పెమ్మసాని వ్యాఖ్యానించారు.

## ఇది ఫస్ట్ వికెట్ మాత్రమే

(మొదటి పేజీ తరువాయి)

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద గత నెల రోజులుగా వారు కొనసాగిస్తున్న ఆందోళనలతోనే ధర్మేంద్ర ప్రధాన్ చివరకు రాజీనామా చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. సీజేపీ ప్రధానంగా చేసిన మూడు డిమాండ్లలో ప్రధాన్ రాజీనామా అత్యంత కీలకమైంది. వారి రెండు డిమాండ్లకు సూత్రప్రాయంగా రెండో విడత చర్చల్లోనే కేంద్ర ప్రభుత్వం అంగీకారం తెలిపింది. మంత్రి రాజీనామా అంశంపై 24 గంటల సమయం కోరింది. చివరకు సీజేపీ డిమాండ్‌కు కేంద్రం దిగరాక తప్పలేదు. అలాగే, విద్యార్థులకు మద్దతుగా సామాజికవేత్త సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్షకు దిగడంతో ఉద్యమం మలుపు తిరిగింది. నీట్ అంశంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పందించి, హామీ ఇవ్వడంతో ఆయన 26 రోజుల అనంతరం ఆమరణ నిరాహార దీక్షను విరమించారు.
ఇదే సమయంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీలో సమూల ప్రక్షాళనకు కేంద్ర ప్రభుత్వం ఉపక్రమించింది. ఏకంగా 47 మంది అధికారులను ఎన్టీఏ నుంచి తొలగించింది. అలాగే, పేపర్ లీక్‌లకు పాల్పడేవారిపై విచారణకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటుచేస్తామని ప్రధాన మంత్రి ప్రకటించారు. అదేవిధంగా ప్రశ్నాపత్రాల లీక్‌ను అరికట్టేందుకు కఠినమైన చట్టం కూడా కేంద్రం తీసుకొస్తోంది. ఇందుకు సంబంధించిన ముసాయిదా బిల్లును శుక్రవారం జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఆమోదించారు.
కేంద్రం ప్రతిపాదించిన బిల్లు ప్రకారం పరీక్ష పత్రాల లీక్‌లో వ్యవస్థీకృత నేరాలకు పాల్పడితే విధించే జైలు శిక్షను 5 నుంచి 10 ఏళ్లకు, జరిమానాను రూ. 1 కోటి నుంచి గరిష్ఠంగా రూ. 10 కోట్లకు పెంచేలా పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) చట్టం 2024కు సవరణ చేయనున్నారు. ఈ బిల్లును సోమవారం పార్లమెంట్ ముందుకు తీసుకురానున్నారు. కేంద్ర ప్రభుత్వం మా డిమాండ్లను అంగీకరించిందని.. దీంతో ఆందోళనను విరమించుకుంటున్నట్లు సీజేపీ ప్రకటించింది. కేంద్ర విద్యాశాఖ మంత్రిగా ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన కొద్దిసేపటికే శనివారం కేంద్ర పెద్దలతో సీజేపీ ప్రతినిధుల మధ్య కీలక సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం కేంద్రమంత్రులతో కలిసి సీజేపీ ప్రతినిధులు మీడియాతో మాట్లాడారు. డిమాండ్లన్నింటినీ ప్రభుత్వం అంగీకరించిందని.. తాము తమ నిరసనను విరమించుకుంటున్నామని ప్రకటించింది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న తమ డిమాండ్‌ను ఈ ఉదయం ప్రభుత్వం అంగీకరించిందని సీజేపీ ప్రతినిధి బృందం పేర్కొంది. మంగళవారం నాటికి తమ ఇతర డిమాండ్లను కూడా నెరవేరుస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని తెలిపారు.
''మేము ప్రభుత్వ ప్రతినిధి బృందంతో మూడు విడతలుగా చర్చలు జరిపాము. కొన్ని రోజులుగా జంతర్ మంతర్ దగ్గర మేము చేస్తున్న నిరసనలో మూడు ప్రధాన డిమాండ్లు ఉన్నాయి. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, నిరసనకారులు, నిర్వాహకులపై దాఖలైన అన్ని చట్టపరమైన కేసులను ఉపసంహరించుకోవాలి. భవిష్యత్తులో నిరసనకారులు లేదా నిర్వాహకులపై ఎలాంటి కేసులు పెట్టకూడదు. నీట్ పరీక్ష వాయిదా పడటంతో తమ ప్రియమైన వారిని కోల్పోయిన కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం ఇవ్వాలన్నది మా మూడవ డిమాండ్. ధర్మేంద్ర ప్రధాన్ కొద్దిసేపటి క్రితమే రాజీనామా చేశారు. అంటే మా మొదటి డిమాండ్ అంగీకరించబడినట్టే.'' అని జాతీయ అధికార ప్రతినిధి అశుతోష్ రాంకా తెలిపారు. కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో జరిగిన సమావేశంలో కేంద్ర ప్రభుత్వం తరఫున కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ హాజరుకాగా.. సీజేపీ ప్రతినిధి బృందంలో సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా ఉన్నారు. సీజేపీ ఆందోళనను విరమించుకున్న అనంతరం కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్, సీజేపీ ప్రధాన ప్రతినిధి సౌరవ్ దాస్, జాతీయ ప్రతినిధి అశుతోష్ రాంకాతో కరచాలనం చేశారు.

## ఎర్రచందనం స్మగ్లింగ్‌కు సహకరిస్తే ఉపేక్షించం

**అమరావతి, జులై 25, అనంతజనశక్తి న్యూస్**

ఎర్రచందనం అక్రమ రవాణా ముఠాలకు సహకరిస్తే ఎవరినైనా ఉపేక్షించేది లేదని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హెచ్చరించారు. స్మగ్లింగ్‌ను అడ్డుకునేందుకు కఠినమైన ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. సీడ్‌బాల్స్ పంపిణీపై అటవీశాఖ అధికారులతో శనివారం పవన్ కళ్యాణ్ సమీక్ష నిర్వహించారు. వెయ్యి ఎకరాల్లో డ్రోన్ల సాయంతో సీడ్ బాల్స్ విసురుతామన్నారు. అటవీ విస్తీర్ణం పెరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎర్ర చందనం అక్రమ రవాణాను ఏ విధంగా అరికడుతున్నదీ ఎప్పటికప్పుడు సమీక్షిస్తానని తెలిపారు. కడప జిల్లాలో రూ.1.5 కోట్ల విలువైన 78 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్న ఘటనపై అధికారులతో మాట్లాడారు. ఇద్దరు అంతర్రాష్ట్ర స్మగ్లర్లతోపాటు వారికి సహకరిస్తున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌ను అరెస్టు చేసినట్లు అధికారులు పవన్‌కు తెలియజేశారు. రాష్ట్రంలో ఎర్రచందనం స్మగ్లింగ్ ముఠాలకు సహకరించే వారు ఎవరైనా ఉపేక్షించేది లేదంటూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వార్నింగ్ ఇచ్చారు. ఎర్రచందనం స్మగ్లింగ్‌ను నిరోధించేందుకు మరింత కఠినమైన ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. ఆపరేషన్ అరణ్య ద్వారా ఎర్ర చందనం అక్రమ రవాణాను ఏ విధంగా అరికడుతున్నారనే విషయాన్ని ఎప్పటికప్పుడు సమీక్షా సమావేశాల ద్వారా తెలుసుకుంటానని స్పష్టం చేశారు. వైఎస్ఆర్ కడప జిల్లా కాశినాయన మండల పరిధిలోని వరికుంట్ల సమీపంలో శనివారం ఎర్రచందనం దుంగలను అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జ్యోతి గుడి వద్ద రూ.1.5 కోట్ల విలువైన 78 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఘటనపై ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం అధికారులతో పవన్ కళ్యాణ్ మాట్లాడారు.

**ఈ ఘటనలో ఇద్దరు అంతర్రాష్ట్ర స్మగ్లర్లను.. వారికి సహకరిస్తున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌ను అరెస్టు చేసినట్లు అధికారులు పవన్ కళ్యాణ్‌కు వివరించారు. ఈ ఘటన పూర్వాపరాలను వివరించారు. శనివారం తెల్లవారుజామున ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం, స్టేట్ ఇంటెలిజెన్స్ బృందానికి సమాచారం అందిందని.. దీంతో వరికుంట్ల గ్రామ సమీపంలో వాహనాల తనిఖీలు చేపట్టినట్లు వివరించారు. ఈ క్రమంలోనే బొలెరో మ్యాక్స్ ట్రక్కులో ఇంటి సామగ్రి ముసుగులో ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించామని అధికారులు తెలిపారు. హర్యానాకు చెందిన ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని.. వారి వద్ద నుంచి రూ.1.5 కోట్ల విలువైన 78 ఎర్రచందనం దుంగలు, బొలెరో వాహనం స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.**

**ఈ ఘటనలో సన్నీ, రమేష్ అనే ఇద్దరిని అరెస్టు చేశామన్న అధికారులు.. విచారణలో జ్యోతి ఫారెస్ట్ బీట్‌లో బీట్ ఆఫీసర్‌గా పనిచేసే మల్లికార్జునుడు అనే ఆఫీసర్ కూడా అక్రమ రవాణా ముఠాలకు సహకరిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. ఈ నేపథ్యంలో అతడిని కూడా అరెస్టు చేసి విచారిస్తున్నట్టు వెల్లడించారు.**

**వీరి వెనుక బెంగళూరు, హర్యానా, కోల్‌కతా ప్రాంతాల్లో మరికొందరు సూత్రధారులు ఉన్నట్లు గుర్తించామని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు వివరించారు. ఈ నేపథ్యంలో ఈ ప్రధాన సూత్రధారులను అదుపులోకి తీసుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని పవన్ కళ్యాణ్ ఆదేశించారు. అలాగే బీట్ ఆఫీసర్ పాత్రపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఆదేశించారు.**

## సత్తా చాటిన బొద్దింకలు

(మొదటి పేజీ తరువాయి)

నీట్ పేపర్ లీక్‌కు బాధ్యతవహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శనివారం మధ్యాహ్నం తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను ఆయన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి పంపారు. ఈ లేఖను ఆయన సోషల్ మీడియాలోనూ పోస్ట్ చేశారు. ధర్మేంద్ర ప్రధాన తన రాజీనామాకు గల కారణాలను అందులో వివరించారు. ''నేను నాలుగు దశాబ్దాలకుపైగా విద్యార్థులు, ఉపాధ్యాయులు విద్యా సంస్కరణల కోసం అంకితభావంతో పనిచేస్తున్నాను.. బలమైన, సమ్మిళితమైన దూరదృష్టి గల విద్యా వ్యవస్థే ఒక బలమైన దేశానికి పునాది అని నేను ఎల్లప్పుడూ నమ్ముతాను... దేశ యువత ఆకాంక్షలు, భావాలు, న్యాయమైన అంచనాలను నేను ఎల్లప్పుడూ గౌరవిస్తాను...
దేశంలో యువతరం కలలను నెరవేర్చడం మనందరి రాజకీయ, సామాజిక జీవిత నైతిక సంకల్పం.. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో దేశానికి సేవ చేసే అవకాశం కల్పించినందుకు నేను వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.. 2026 మే 3న నిర్వహించిన నీట్ యూజీ పరీక్షలో అవకతవకలు బయటపడ్డాయి... భారత ప్రభుత్వం వెంటనే దీనిని సుమోటోగా స్వీకరించి, దర్యాప్తును సీబీఐకి అప్పగించి, పరీక్షను రద్దు చేసి, తిరిగి నిర్వహించింది... వచ్చే ఏడాది నుంచి పరీక్షను కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహించాలని కూడా నిర్ణయించారు.. 20 లక్షలకుపైగా విద్యార్థులకు పరీక్షలు సజావుగా జరిగేలా చూడటమే మా ప్రధాన ప్రాధాన్యత... ఇందుకోసం సమగ్ర ప్రభుత్వ విధానాన్ని అనుసరించాం...
భారత ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ముఖ్యంగా జిల్లా యంత్రాంగం కీలక పాత్ర పోషించాయి... అంతేకాకుండా, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, సంరక్షకుల సహకారంతో జూన్ 21న రీటెస్టట్ పరీక్షలు పూర్తయ్యింది. మొదటి రోజు నుంచే నేను దీని బాధ్యత తీసుకున్నాను.. ఈ పరిస్థితి నుంచి ఎన్నడూ వెనుకాడలేదు... పరీక్షల మాఫియా వల్ల ఏ ఒక్క ప్రతిభావంతుడైన విద్యార్థి భవిష్యత్తు దెబ్బతినడానికి, అన్యాయం జరగడానికి అనుమతించకూడదనేది నా సంకల్పం.. జులై 16న ప్రకటించిన నీట్ యూజీ ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నాయి.. పేద కుటుంబ నేపథ్యాల నుంచి వచ్చిన అనేక ప్రతిభావంతులైన విద్యార్థులు కూడా విజయం సాధించారు.. కానీ ఈ సమయంలో కూడా, బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు చాలా మంది విద్యార్థులను తప్పుదోవ పట్టించడానికి అడ్డంకులు సృష్టించడానికి ప్రయత్నించారు.. ఆ విషయం నన్ను చాలా బాధపెట్టింది..
మన ప్రజాస్వామ్యంపై నాకు ఎల్లప్పుడూ అచంచలమైన నమ్మకం ఉంది.. యువత ఆకాంక్షలు, కలలు, అంచనాలను నేను ఎల్లప్పుడూ గౌరవిస్తాను. వారు భారతదేశ భవిష్యత్తు మాత్రమే కాదు, నవ, వికసిత భారత్ నిర్మాతలు.. భవిష్యత్ శిల్పులు కూడా... గత 10 రోజుల నుంచి జరుగుతున్న పరిణామాలు చూసి నా మనసు బాధించింది.. ఇది నా వ్యక్తిగత ప్రతిష్టకు సంబంధించిన విషయం కాదు... యువశక్తే ఈ దేశానికి అసలైన బలం.. యువశక్తిని గందరగోళం అనే కుట్రలో చిక్కుకోనివ్వం.. ఇదే నా సంకల్పం. జంతర్ మంతర్ వద్ద, దేశంలో నెలకొన్న ఈ పరిస్థితిని దేశవ్యతిరేక శక్తులు సద్వినియోగం చేసుకోకుండా, దేశ ఐక్యత నిలిచి ఉండేలా, భారత్‌లోని ఒక్క విద్యార్థి భవిష్యత్తు కూడా చట్టపరమైన చిక్కుల్లో పడకుండా, మన పిల్లలు చదువుపై సమయాన్ని వెచ్చించి కెరీర్‌ను నిర్మించుకోవడంపై దృష్టి పెట్టాలనే ఆలోచనతో నేను నా రాజీనామా లేఖను గౌరవనీయ ప్రధానమంత్రి గారికి పంపాను.

**మోదీ మార్గదర్శకత్వం, విశ్వాసం, నిరంతర సహకారానికి నేను హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నాను. అలాగే, క్యాబినెట్‌లోని సహచరులు, మంత్రిత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు, నాతో కలిసి పనిచేసే భాగ్యం లభించిన వారందరికీ నా కృతజ్ఞతలు. దేశసేవ నా జీవితంలో అత్యున్నత ప్రాధాన్యత. దీని కోసం నేను ఎల్లప్పుడూ అంకితభావంతో ఉంటాను.. శ్రీ జగన్నాథ స్వామి ఆశీస్సులతో భవిష్యత్తులో కూడా భారత్ మాత, ఒడిశా ప్రజలు, దేశ యువత ఆకాంక్షల నెరవేర్పు కోసం నన్ను నేను సాధ్యమైన రీతిలో మలుచుకుంటాను" అని ధర్మేంద్ర ప్రధాన్ తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు.**

ఆదివారం | రంగారెడ్డి
26.07.2026
అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం


# విద్యార్థుల ఆందోళనల్లో మంత్రి కుమార్తె..



సోషల్ మీడియా ఖాతాల డీయాక్టివేట్

నీట్ పేపర్ లీక్ కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ

మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ జులై 23న దేశవ్యాప్తంగా విద్యార్థులు ఆందోళనలు చేపట్టారు. అస్సాంలోని గువాహటిలో జరిగిన నిరసనల్లో ఆ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి కేశవ్ మహంత కుమార్తె దిబిశా మహంత కూడా పాల్గొన్నారు. పేపర్ లీక్‌కు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని.. దీనికి బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఆమె తోటి నిరసనకారులతో కలిసి నినాదాలు చేశారు.

ఆమె తండ్రి కేశవ్ మహంత అస్సాంలోని భాజపా నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నప్పటికీ.. దిబిశా కేంద్రానికి వ్యతిరేకంగా ఆందోళనల్లో పాల్గొనడం సోషల్‌మీడియాలో చర్చనీయాంశంగా మారింది. ఏజీపీ రాష్ట్ర అధ్యక్షుడు అతుల్ బోరా తర్వాత ఆ పార్టీలో అత్యంత సీనియర్ నేత కేశవ్ మహంత. 2016 నుంచి భాజపా ప్రభుత్వంలో మంత్రిగా కొనసాగుతున్నారు. మరోవైపు నిరసనలపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ స్పందిస్తూ.. విద్యార్థులకు నిరసన తెలిపే హక్కు ఉంటుందని, దానిని తాము గౌరవిస్తున్నామని తెలిపారు. ఈ అంశాన్ని ప్రధాని మోదీ క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారని పేర్కొన్నారు.

**సోషల్ మీడియా ఖాతాలు డీయాక్టివేట్..**

దిబిశా నిరసనల్లో పాల్గొన్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఆమె నిరసనలకు పలువురు మద్దతు తెలుపుతుండగా.. మరికొందరు విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ క్రమంలో నాటి నుంచి ఆమె సోషల్ మీడియా ఖాతాలు అందుబాటులో లేవు. వాటిని ఆమే స్వచ్ఛందంగా డీయాక్టివేట్ చేశారా.. మరేదైనా కారణంతో తొలగించారా.. అనే దానిపై స్పష్టత లేదు. మరోవైపు తమ కుమార్తె ఆందోళనల్లో పాల్గొనడంపై మంత్రి కేశవ్ మహంత స్పందించారు. స్నేహితులు ట్యూషన్ పేరుతో ఆమెను ఇంటి నుంచి తీసుకెళ్లారని.. నిరసనల విషయం ఆమెకు ముందుగా తెలియదని చెప్పారు.

# సల్మాన్ ఖాన్ భయపడ్డాడా..

## ట్రోల్స్‌కు కౌంటర్ ఇస్తూ పోస్టు





నీట్ పేపర్ లీకేజీ వివాదంపై విద్యార్థులు చేపట్టిన నిరసనలకు బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ మద్దతు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తనను ట్రోల్ చేస్తున్న వారికి తనదైన శైలిలో గట్టి సమాధానమిచ్చారు. భయపడి వెనక్కి తగ్గారంటూ సామాజిక మాధ్యమాల్లో వస్తోన్న వార్తలకు ఒక్క క్యాప్షన్‌తో సల్మాన్ చెక్ పెట్టారు. ఫిట్‌నెస్‌కు చిరునామాగా ఉండే ఈ హీరో జిమ్ ఫొటో షేర్ చేసి.. ''సల్మాన్ ఖాన్ భయపడ్డాడా?.. అస్సలు కాదు. భయపడేవారు చనిపోయినట్లే'' అని పేర్కొన్నారు.

నీట్ పేపర్ లీక్ వివాదంపై సల్మాన్ వరుసగా రెండు పోస్టులు చేసిన విషయం

తెలిసిందే. మొదట విద్యార్థులకు మద్దతు ఇస్తూ ఆయన పోస్టు పెట్టారు. మెరుగైన విద్యావ్యవస్థను కోరుతూ విద్యార్థులంతా ఒక్కటై ముందుకు రావడం, వారికి తల్లిదండ్రులు తోడుగా నిలవడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ ఉద్యమంలో విద్యార్థులకు దెబ్బలు తగలడం తనను బాధించిందని పేర్కొన్నారు. ఆ మరుసటి రోజు ఇదే వివాదంపై మరో పోస్టు పెట్టారు. విద్యార్థులు సురక్షితంగా ఇళ్లకు తిరిగి వెళ్లాలని సూచించారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఇక సోనమ్ వాంగ్ చుక్ కూడా దీక్ష విరమించాలని కోరారు. దీంతో సల్మాన్ భయపడ్డారని కొందరు ట్రోల్ చేశారు. అంతకుముందు.. సల్మాన్‌కు చెందిన ఓ పాత వీడియో కూడా వైరల్ కాగా.. దానిపై కూడా విమర్శలు వచ్చాయి. తాజా పోస్ట్‌తో ఈ కండల వీరుడు వాటికి చెక్ పెట్టారు.

మరోవైపు, విద్యార్థులు సీజేపీ నిరసనకారుల ప్రధాన డిమాండ్ నెరవేరడంతో దిల్లీలో పరిస్థితులు సాధారణ స్థాయికి చేరుకుంటున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఆందోళనల కారణంగా సెంట్రల్ దిల్లీలో మూతపడిన రాజీవ్ చౌక్, మండీ హౌస్, సెంట్రల్ సెక్రటేరియట్ మెట్రో స్టేషన్లను తెరచినట్లు దిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ ప్రకటించింది.

# కేంద్రంతో సీజేపీ ప్రతినిధుల చర్చలు

**నీట్ పేపర్ లీక్ వ్యవహారానికి పరిష్కార మార్గం కనుక్కొనేందుకు గాను కాక్రోచ్ జనతా పార్టీ ప్రతినిధులు, కేంద్రం మూడోసారి చర్చలు జరుపుతున్నారు. ఈ చర్చల్లో కేంద్రం తరపున మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌లు పాల్గొనగా.. సీజేపీ తరపున సౌరవ్ దాస్, అశుతోష్‌లు పాల్గొన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ప్రకటించిన నేపథ్యంలో ఈ చర్చలకు మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.**

**మరోవైపు, విద్యార్థులు సీజేపీ నిరసనకారుల ప్రధాన డిమాండ్ నెరవేరడంతో దిల్లీలో పరిస్థితులు సాధారణ స్థాయికి చేరుకుంటున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఆందోళనల కారణంగా సెంట్రల్ దిల్లీలో మూతపడిన రాజీవ్ చౌక్, మండీ హౌస్, సెంట్రల్ సెక్రటేరియట్ మెట్రో స్టేషన్లను తెరచినట్లు దిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ ప్రకటించింది.**



# ఏ ప్రభుత్వమైనా తప్పు జరిగితే తలవంచాల్సిందే

**- ప్రధాన్ రాజీనామాపై విపక్షాలు**



క్రోచ్ జనతా పార్టీ చేపట్టిన నిరసనలతో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. దీనిపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను స్వాగతించారు. విద్యావ్యవస్థ పునర్నిర్మాణంలో తొలి అడుగు పడిందన్నారు. దేశవ్యాప్తంగా విద్యార్థుల పోరాటం చూసి గర్విస్తున్నట్లు పేర్కొన్నారు. వీధుల్లోకి వచ్చి పోరాడిన యువత, విద్యార్థులకు అభినందనలు తెలిపారు. మరో రెండు డిమాండ్లు మిగిలి ఉన్నాయని..వాటిని కూడా త్వరగా తీర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆందోళనకారులపై జరిగిన లాఠీఛార్జిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

'విద్యా వ్యవస్థను సరిదిద్దడం కోసం దేశవ్యాప్తంగా లక్షలాది మంది యువత ధైర్యంగా పోరాడారు. ప్రధాన్ రాజీనామాతో విద్యార్థులు, అవినీతి ప్రభుత్వం కారణంగా తమ పిల్లలను కోల్పోయిన కుటుంబాలు, యువత తరపున పార్లమెంట్‌లో గళం విప్పిన ప్రతిపక్షాలు విజయం సాధించాయి' ఏ ప్రభుత్వమైనా తప్పు జరిగితే ప్రజల ముందు తలవంచాల్సిందేనన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే 'యువత పోరాటం అసామాన్యం.. ఇదంతా వారి విజయం. ప్రజాస్వామ్యంలో ప్రజల ఆకాంక్షలే అంతిమం. పోరాడి సాధించిన విద్యార్థి లోకానికి శుభాకాంక్షలు' కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ 'ఇది ప్రజాస్వామ్య విజయం. వీధుల నుంచే నేరుగా వచ్చిన ప్రత్యక్ష ప్రజాస్వామ్యం ఇది. శాంతి, సహనం, పట్టుదలకు దక్కిన విజయమిది. భయాన్ని వీడి దేశంలోని నలుమూలల నుంచి కదిలి వచ్చిన పౌరులందరికీ కృతజ్ఞతలు. కాక్రోచ్ జనతా పార్టీ నేతలకు అభినందనలు' సోనమ్ వాంగ్‌చుక్ 'కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేశారన్న వార్త ఇప్పుడే విన్నాను. ఈ రాజీనామాను నేను స్వాగతిస్తున్నాను. ఈ చర్య దేశంలోని పరిస్థితిని చక్కదిద్ది.. పార్లమెంటులోనూ, వెలుపలా మౌలిక సమస్యలపై చర్చలకు మార్గం సుగమం చేస్తుందని ఆశిస్తున్నాను' కాంగ్రెస్ నేత చిదంబరం 'అభినందనలు.. ఎట్టకేలకు ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. విద్యార్థులు లాఠీ దెబ్బలు తిని.. గాయాలపాలయ్యారు. కొందరు 23 రోజుల పాటు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ నిరసనలతోనే కేంద్రం దిగి వచ్చింది' రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ 'ప్రజాస్వామ్యంలో జవాబుదారీతనం నుంచి తప్పించుకోలేమనే విషయాన్ని విద్యాశాఖ మంత్రి అంగీకరించారు. దేశవ్యాప్తంగా ఉన్న పౌరులు వారాల తరబడి పోరాటం చేస్తే ఇది జరిగింది. శాంతియుతంగా నిరసన తెలిపే తమ ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకున్నందుకు.. ఎంతో మంది విద్యార్థులు పోలీసుల క్రూరత్వానికి, బలప్రయోగానికి గురయ్యారు. కానీ విద్యాశాఖ మంత్రి రాజీనామాతో జవాబుదారీతనం ముగిసిపోదు. మనల్ని ఈ దుస్థితికి తీసుకువచ్చిన ప్రభుత్వ వైఫల్యాలను సరిచేయడానికి ప్రభుత్వం సంస్కరణలు చేపట్టాలి. మళ్లీ ఇటువంటి పరిస్థితి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి. ఈ నిరసనలు సంస్కరణలకు ఆరంభం మాత్రమే.. ముగింపు కాదు' కాంగ్రెస్ నేత శశి థరూర్ 'ఇది ప్రజాస్వామ్యానికి అతిపెద్ద విజయం. వ్యవస్థలో జరిగిన తప్పులకు వ్యతిరేకంగా పోరాడి..విజయం సాధించిన యువతకు అభినందనలు'అరవింద్ కేజ్రీవాల్

# ఇది విద్యార్థుల విజయం..

## ప్రధాన్ రాజీనామాపై సీజేపీ



నీట్ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఆందోళనల నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. దీనిపై సీజేపీ హర్షం వ్యక్తం చేసింది. 'ఇది విద్యార్థుల విజయం' అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేసింది.

ప్రధాన్ రాజీనామాతో దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే మాట్లాడుతూ.. "శాంతియుతంగా చేసే ఏ ఆందోళనతో అయినా లక్ష్యం తప్పకుండా నెరవేరుతుంది. దీన్ని గాంధీజీ నుంచి నేర్చుకున్నా. ఈ దేశ యువత శాంతియుత నిరసనలు వృథాగా పోలేదు. విద్యార్థుల పోరాటం ఫలించింది. వారి సత్తా ఏంటో తెలిసింది. ఈ విజయం విద్యార్థులందరిది. ప్రజాస్వామ్యం అంటే ఇదే" అని ఆనందం వ్యక్తం చేశారు.

"మాకు రాజకీయాలు అవసరం లేదు. మా డిమాండ్లలో ఒకటి నెరవేరింది. మిగతా రెండూ నెరవేరే వరకు వేచి చూస్తాం. విద్యార్థులపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి. విద్యార్థులపై పెట్టిన అన్ని కేసులు పూర్తిగా ఎత్తివేయాలి. విద్యావ్యవస్థను ప్రక్షాళన చేసే వరకు ఈ ఉద్యమం ఆగదు. ఈ సాయంత్రం 6.30 గంటలకు కొవ్వొత్తులతో ర్యాలీ చేద్దాం" అని సీజేపీ నేతలు యువతకు పిలుపునిచ్చారు.

**ఎవరీ అభిజీత్ దీప్కే..**

విద్యావ్యవస్థపై లోపాలను ఎత్తిచూపుతూ పుట్టుకొచ్చిన పార్టీనే సీజేపీ. సరిగ్గా రెండు నెలల క్రితం అభిజీత్ దీప్కే దీనిని ఏర్పాటు చేశారు. కొన్ని గంటల్లోనే ఇంటర్నెట్‌లో దాని పేరు మారుమోగిపోయింది. తర్వాత నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో దీప్కే జంతర్ మంతర్ వద్ద ప్రారంభించిన నిరసనలకు భారీ సంఖ్యలో యువత స్పందించింది. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు నిరసన వేదికవద్దకు వచ్చి మద్దతు తెలిపారు. జులై 20న 'చలో పార్లమెంట్' మార్చ్, ప్రధాన్ రాజీనామా నుంచి సీజేపీ వెనక్కి తగ్గకపోవడంతో ప్రభుత్వం దిగిరావాల్సి వచ్చింది. ఈ పరిణామాల్లో కీలకంగా వ్యవహరించిన 30 ఏళ్ల దీప్కే.. మహారాష్ట్రలోని పుణెలో జర్నలిజం చదివారు. అమెరికాలోని బోస్టన్ యూనివర్సిటీ నుంచి పబ్లిక్ రిలేషన్స్‌లో మాస్టర్స్ చేశారు.

# వీడియోలు కాదు.. చర్యలు కావాలి: మోదీపై రాహుల్ విమర్శలు



కాక్రోచ్ జనతాపార్టీ దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద చేపడుతోన్న నిరసనల్లో ) భాగంగా నిరాహార దీక్ష చేస్తోన్న విద్యార్థుల బృందాన్ని శనివారం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కలిశారు. ఈ సందర్భంగా కేంద్రంపై విమర్శలు చేసిన ఆయన.. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌ను పునరుద్ఘాటించారు. విద్యావ్యవస్థలో అవినీతికి ధర్మేంద్ర ప్రధాన్ ప్రతీక అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆయన్ను విద్యాశాఖ నుంచి తప్పించి మరో శాఖకు బదిలీ చేస్తారనే వార్తలు వినిపిస్తున్నాయని, మంత్రిని తొలగించడం మినహా మరేదీ కూడా విద్యార్థులకు ఆమోదయోగ్యం కాదన్నారు. అలాగే అర్ధరాత్రి సమయంలో ప్రధాని మోదీ షేర్ చేస్తోన్న వీడియోల గురించి ప్రస్తావించారు. తమకు కావాల్సింది చర్యలని.. వీడియోలు కాదని పేర్కొన్నారు.

# సీజేపీ నిరసనలు.. 480 పాక్ ఖాతాలను నిలిపేశాం:



కాక్రోచ్ జనతా పార్టీ నిరసనల నేపథ్యంలో శనివారం దిల్లీ పోలీసులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ ఆందోళనల గురించి సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున నకిలీ వార్తల ప్రచారం జరుగుతోందని వెల్లడించారు. దాంతో శాంతి భద్రతలకు ముప్పు వాటిల్లుతోందని పేర్కొన్నారు. పాకిస్థాన్ కేంద్రంగా నడుస్తోన్న 480 ఖాతాలను బ్లాక్ చేశామని చెప్పారు .

''ప్రజలు నకిలీ, వాస్తవ సమాచారానికి మధ్య తేడా గుర్తించగలిగేలా.. మా సోషల్ మీడియా ఖాతాల్లో ఏఐ, డీప్‌ఫేక్, ఎడిట్ చేసిన క్లిప్‌లు, తప్పుదోవ పట్టించే పోస్ట్‌ల గురించి నిరంతరం అప్రమత్తం చేస్తున్నాం'' అని పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు.

# మోదీ పేరుతో వీడియోలు.. పీఐబీ ఫ్యాక్ట్ చెక్





**దిల్లీలో ఆందోళనలు చేపట్టిన విద్యార్థులను ప్రధాని నరేంద్ర మోదీ కేంద్ర మంత్రులు, ఆర్మీ అధికారులు బెదిరిస్తున్నట్లు ఉన్న పలు వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వీటిపై పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం స్పష్టతనిచ్చింది. అవన్నీ నకిలీ వీడియోలని , ఏఐతో సృష్టించారని వెల్లడించింది. ఆ నకిలీ వీడియోలలో చూపినట్లు ప్రధాని గానీ, కేంద్ర మంత్రులు గానీ ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని పేర్కొంది. దేశంలో జరుగుతోన్న ఆందోళనలను అదనుగా చేసుకొని పాకిస్థాన్‌కు చెందిన కొన్ని నెట్‌వర్క్‌లు ఈ వీడియోలను సర్క్యులేట్ చేస్తున్నాయని తెలిపింది.**

**ప్రశ్నపత్రాల లీకేజీపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇస్తూ గురువారం రాత్రి మోదీ షేర్ చేసిన వీడియో.. ఇటీవల పార్లమెంటు బయట కేంద్రమంత్రి పీయూష్ గోయల్ మాట్లాడిన వీడియోలను ఏఐతో మార్ఫింగ్ చేసినట్లు పీఐబీ వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి ఏదైనా అనుమానాస్పద, ఫేక్ కంటెంట్ ప్రజల దృష్టికి వస్తే వాట్సప్ నంబర్ +91 8799711259, Email: factcheck@pib.gov.in ద్వారా తమకు రిపోర్టు చేయాలని కోరింది.**

# జెన్–జీని చూస్తుంటే గర్వంగా ఉంది: జ్యోతిక



జెన్‌జీని చూస్తుంటే గర్వంగా ఉందన్నారు సినీ నటి జ్యోతిక . ప్రస్తుతం దేశంలో చర్చనీయాంశంగా మారిన పరిణామాలపై ఆమె ఇన్‌స్టాలో పోస్టు పెట్టారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే విద్యార్థుల డిమాండ్‌కు తాను మద్దతు ఇస్తున్నట్లు చెప్పారు. ''నేను విద్యార్థులు, మన దేశ భవిష్యత్తు కోసం ఆలోచిస్తాను. జవాబుదారీతనానికి మద్దతు ఇస్తాను. ప్రజాస్వామ్య భారతదేశం కోసం.. మంచి విద్యా వ్యవస్థ కోసం నిలబడతాను'' అని పేర్కొన్నారు.

సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్, సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేలను ఆమె ప్రశంసించారు. ''ఒక తల్లిగా మా పిల్లలను మీలాగే పెంచాలని కోరుకుంటున్నా. నిర్భయంగా, ఎలాంటి ముసుగులు లేకుండా పోరాడుతోన్న జెన్‌జీ యువతను చూసి గర్విస్తున్నాను. అందరూ కలిస్తేనే దేశం ముందుకు వెళ్తుందని మీరు నిరూపించారు. ఒత్తిడిని అధిగమించినందుకు.. మాలో భయాన్ని తొలగించినందుకు ధన్యవాదాలు'' అని జ్యోతిక తన పోస్టులో రాసుకొచ్చారు. నీట్ ప్రశ్నపత్రం లీక్‌పై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేస్తోన్న ఉద్యమానికి సినీ ప్రముఖుల నుంచి మద్దతు పెరుగుతోంది. దర్శకుడు శేఖర్ కమ్ముల కూడా జెన్ జీ ఉద్యమం తనలో స్ఫూర్తినింపిందని పేర్కొన్నారు. విద్యార్థుల డిమాండ్లలో న్యాయం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వాళ్ల మాట వినాలని.. భరోసా ఇవ్వాలని కోరారు. విద్యార్థులు గెలిస్తే దేశం గెలిచినట్లేనని అన్నారు.



# మరో హరిత విప్లవానికి వెటివర్

ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పుల ప్రభావాల తగ్గింపు, నీటి సంరక్షణ, నేల కోత నివారణ, గ్రామీణ ఉపాధి కల్పన వంటి అనేక సవాళ్లకు పరిష్కారాలను అన్వేషిస్తున్నాయి. ఈ విషయంలో వెటివర్‌ను (ఖస్ గడ్డిని) అరుదైన ప్రాకృతిక వరంగా పరిగణించవచ్చు. విస్తారమైన సాగు భూములు కలిగిన ఇండియాలో వెటివర్‌ను ఒక హరిత జీవనోపాధి ఉద్యమంగా మార్చగలిగితే లక్షలాది కుటుంబాలకు, పర్యావరణానికి ఎంతో మేలు కలుగుతుంది.

వాతావరణ మార్పులు, నేల కోత, భూగర్భ జలాల తగ్గుదల, సాగు భూముల సారహీనత వంటి సమస్యలు నేడు వ్యవసాయ రంగానికి పెద్ద సవాళ్లుగా మారాయి. మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో స్థిరమైన ఉపాధి అవకాశాల కొరతా ఆందోళన కలిగిస్తోంది. ఈ రెండు సమస్యలకు ఒకేసారి పరిష్కారం చూపగల సామర్థ్యం ఉన్న మొక్క వెటివర్ (ఖస్‌గడ్డి). పర్యావరణ పునరుద్ధరణ, నీటి శుద్ధీకరణ, వాతావరణ మార్పులను తట్టుకునే సామర్థ్య పెంపునకూ ఇది తోడ్పడుతుంది. ప్రపంచవ్యాప్తంగా అద్భుత గడ్డిగా పేరుపొందిన వెటివర్ (క్రిసోపోగొన్ జిజానియోడిస్) లోతైన వేర్లతో పెరుగుతుంది. ఎండలను, భారీ వర్షా లను తట్టుకుని దాదాపు అన్ని రకాల నేలల్లోనూ అది ఎదుగుతుంది. అందువల్ల అన్ని చోట్లా దాన్ని విస్తృతంగా సాగు చేయవచ్చు.

నేలకు సహజ రక్షాకవచం

వర్షా లు కురిసినప్పుడు సారవంతమైన మట్టి పెద్దమొత్తంలో కొట్టుకుపోతుంటుంది. ఇలాంటి నేల కోత రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తోంది. వెటివర్ గడ్డి వేర్లు మూడు నుంచి అయిదు మీటర్ల లోతు వరకు విస్తరించి నేలను బలంగా బంధిస్తాయి. దానివల్ల వర్షపు నీటి వేగం తగ్గి మట్టి కొట్టుకుపోకుండా ఉంటుంది. పొలాల అంచుల్లో, చెరువుల గట్లపై, కాలువల పక్కన, కొండ వాలుల్లో వెటివర్‌ను నాటితే నేల కోతను గణనీయంగా తగ్గించవచ్చు. అంతేకాకుండా వెటివర్‌తో వర్షపు నీరు భూమిలోకి ఇంకే అవకాశం పెరిగి భూగర్భ జలాలు పునరుద్ధరణకు నోచుకుంటాయి. వ్యవసాయంలో నేడు రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగం కట్టుతప్పుతోంది. వాటి అవశేషాలు వాన నీటితో కలిసి వాగులు, నదులు, చెరువుల్లోకి చేరి కాలుష్యానికి కారణమవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో వెటివర్ సహజ వడపోత వ్యవస్థగా పనిచేస్తుంది. రసాయన అవశేషాలు, కాలుష్యకారక పదార్థాలను అడ్డుకుని అది నీటి వనరులను రక్షిస్తుంది. తద్వారా తాగునీటి వనరుల నాణ్యత మెరుగుపడటానికి దోహదపడుతుంది. వెటివర్‌ను పశువుల మేతగా, నేలలో తేమ ఆరకుండా, కలుపు పెరగకుండా సాగుభూమి మల్చింగ్ కోసం, సేంద్రియ ఎరువుల తయారీకీ వినియోగించవచ్చు. అసలు వాణిజ్య విలువ వెటివర్ వేర్లలోనే ఉంది. వాటి నుంచి సుగంధ తైలాన్ని (ఎసెన్షియల్ ఆయిల్) తయారు చేస్తారు. ఈ నూనెకు అంతర్జాతీయ మార్కెట్లో భారీ గిరాకీ ఉంది. ఖరీదైన సుగంధ ద్రవ్యాలు, కాస్మొటిక్స్, సబ్బులు, షాంపూల తయారీలో ఈ ఆయిల్‌ను ఉపయోగిస్తారు. ఒకసారి నాటిన తర్వాత అనేక సంవత్సరాలు దిగుబడి ఇస్తుండటం వల్ల రైతులకు వెటివర్ స్థిరమైన ఆదాయ వనరుగా మారే అవకాశం ఉంది.

స్వయం సహాయక సంఘాల ద్వారా వెటివర్ సాగు, నర్సరీల ఏర్పాటు, మొక్కల సరఫరా, ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్‌ను ప్రోత్సహిస్తే వేలాది మంది మహిళలకు ఉపాధి లభిస్తుంది. గ్రామ స్థాయిలో వెటివర్ నర్సరీలను ఏర్పాటు చేస్తే మహిళలకు స్థానికంగానే ఆదాయం లభిస్తుంది. అలాగే వెటివర్ ఆధారిత సూక్ష్మ పరిశ్రమలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపును తీసుకొస్తాయి.

ఒకేసారి మూడు లాభాలు

ప్రపంచవ్యాప్తంగా కర్బన ఉద్గారాల నియంత్రణకు ప్రాధాన్యం పెరుగుతోంది. వెటివర్ తన విస్తారమైన వేర్ల వ్యవస్థ ద్వారా కార్బన్‌ను భూమిలో నిల్వ చేయగలదు. తద్వారా భవిష్యత్తులో కార్బన్ క్రెడిట్ల ద్వారానూ ఆదాయం పొందే వీలుంటుంది. ఇన్ని ప్రయోజనాలున్న వెటివర్ సాగుకు ఊతమిచ్చేందుకు ప్రభుత్వాలు ప్రతి జిల్లాలో నమూనా ప్రదర్శన క్షేత్రాలను నెలకొల్పాలి. మహిళా సంఘాల ద్వారా నర్సరీలను అభివృద్ధి చేయాలి. రైతులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలి. వాటర్‌షెడ్, మిషన్ కాకతీయ, నదీ తీర రక్షణ, రహదారి పరిరక్షణ కార్యక్రమాల్లో వెటివర్‌ను భాగం చేయాలి. వెటివర్ వేర్లు, నూనె, ఇతర ఉత్పత్తులకు మార్కెట్ అనుసంధానత కల్పించాలి. వ్యవసాయాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, గ్రామీణ ఉపాధి- ఈ మూడు లక్ష్యాలను ఒకేసారి సాధించగల అవకాశాన్ని వెటివర్ అందిస్తోంది. పచ్చదనాన్ని పెంచుతూ ప్రజల ఆదాయ వృద్ధికి తోడ్పడే 'హరిత ఆర్థిక వ్యవస్థ' వైపు అడుగులు వేయాలంటే వెటివర్ ఉద్యమాన్ని బలంగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది.

# ఇథనాల్ ప్రయాణంలో ముందుకెళ్లేదెలా?

జూన్ 13వ తేదీన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కీలక ప్రకటన ఒకటి చేశారు. అదేమీ చిన్న విషయం కాదు. భారతదేశ ఇంధన చరిత్రలో ఒక కొత్త అధ్యాయాన్ని ప్రారంభించిన నిర్ణయానికి సంబంధించిన అంశమది. వందశాతం ఇథనాల్ మిశ్రమ ఇంధనానికి చట్టబద్ధమైన గుర్తింపునిస్తూ తీసుకున్న నిర్ణయమది. దాంతో ఇప్పుడు దేశవ్యాప్తంగా రెండు ప్రశ్నలు వినిపిస్తున్నాయి: 'భారత్ నిజంగానే పెట్రోల్ నుంచి విముక్తి పొందుతుందా? పంట వ్యర్థాలు ఇంధనంగా మారే రోజు ఎప్పుడొస్తుంది?' అని. వీటికి సమాధానం తెలుసుకునే ముందు నిజాయతీతో కూడిన ఒక లెక్క వేసుకోవాలి.ముడిచమురు దిగుమతులనూ, కర్బన ఉద్గారాలనూ తగ్గించడానికి కేంద్రం కొంతకాలంగా పెట్రోల్‌లో ఇథనాల్ మిశ్రమాన్ని ప్రోత్సహిస్తోంది. ఇథనాల్ కలిపిన శాతాన్ని బట్టి ఈ5, ఈ20 పెట్రోల్‌గా పిలుస్తారు. 'గడిచిన పదకొండేళ్లలో భారతదేశ ఇథనాల్ ప్రయాణం ఈ5 నుంచి ఈ20కి విజయవంతంగా సాగింది. అయిదేళ్లు ముందుగానే, నిరుడు జులై నాటికి లక్ష్యాన్ని ఛేదించాం. 2014-25 మధ్య లక్ష కోట్ల రూపాయలకు పైగా విదేశీ మారక ద్రవ్యం ఆదా అయింది. మరోవైపు, 30కోట్ల చెట్లు నాటాం. ఫలితంగా 736లక్షల టన్నుల మేర కర్బన ఉద్గారాలు తగ్గాయి' అని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ లెక్కలు అభినందించదగ్గవే. 2014లో పెట్రోల్‌లో కేవలం 1.53 శాతంగా ఉన్న




**ఇథనాల్ మిశ్రమం నేడు 20శాతానికి చేరింది. కానీ, ఇథనాల్ వాడకానికి సంబంధించి దేశీయంగా అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వాహన సామర్థ్యం నుంచి పర్యావరణం వరకు వివిధ అంశాలను అవి చర్చకు పెడుతున్నాయి.**

అసలు సమస్య ఎక్కడుందంటే...

ఈ20 నుంచి వందశాతం ఇథనాల్ వైపు పరుగులు తీయాలని ఉత్సాహపడుతున్నాం. కానీ, క్షేత్రస్థాయి వాస్తవాలు అంత అనుకూలంగా ఏమీ లేవు. దేశీయంగా ప్రస్తుతం ఇథనాల్ ఉత్పత్తి సామర్థ్యం ఏడాదికి 2000 2100 కోట్ల లీటర్లు. కానీ, ఈ20కి అవసరమయ్యేది 10001200 కోట్ల లీటర్లే. కొద్ది నెలల క్రితం చమురు కంపెనీలు 1050 కోట్ల లీటర్ల ఇథనాల్ కొనుగోలుకు టెండర్లను పిలిచాయి. తయారీదారులేమో 1776 కోట్ల లీటర్లు సరఫరా చేస్తామన్నారు. అంటే, గిరాకీ కంటే 70శాతం అధికం! అమ్ముడుపోక ఇథనాల్ మిగిలిపోతున్నప్పుడు ఈ85, ఈ100 లక్ష్యాలను ఎప్పుడు చేరుకోగలం? పైగా ఆ లక్ష్యాలను చేరుకోవడానికి ముడిసరకు, సాంకేతికత, వసతులు ఏకబిగిన సమకూరాలి. మరో సమస్య వాహన సాంకేతికత. 2023 ఏప్రిల్ తరవాత తయారైన వాహనాలు ఈ20కి అనుకూలమే కానీ, ఈ30కి మించిన మిశ్రమ ఇంధనాన్ని తట్టుకోలేవు. ఈ85, ఈ100ల కోసం వేర్వేరు వాహన సాంకేతికతలు కావాలి. ప్రస్తుతం రోడ్లపై తిరుగుతున్న 35 కోట్లకు పైగా వాహనాలను అందుకు అనుగుణంగా మార్చడానికి ఏకంగా ఒక తరమే పడుతుంది. అందుకేనేమో ప్రధానమంత్రి సలహాదారు తరుణ్ కపూర్ 'ముందు ఈ20ని స్థిరపడనివ్వండి. తరవాత ఈ25కి, అక్కడి నుంచి నెమ్మదిగా పూర్తిస్థాయి ఇథనాల్‌వైపు వెళ్దాం' అని వ్యాఖ్యానించారు.


మొదటితరం ఇథనాల్ తయారీకి చెరకు రసం, మొలాసిస్, విరిగిన బియ్యం, మొక్కజొన్న వంటివి అవసరం. వాటిని అలా మళ్లించడం నైతికంగా సరైనదేనా? ఆహార భద్రతను ఇది ప్రమాదంలోకి నెట్టేస్తుంది కదా? అనే ప్రశ్నలూ ఎదురవుతున్నాయి. పైగా భారత్‌లో 85శాతం రైతులు సగటున రెండు హెక్టార్లలోపు భూమినే సాగుచేస్తున్నారు. కాబట్టి, మనకు రెండోతరం ఇథనాల్ వ్యూహమే సరిపోతుంది. దీనికి కేవలం పంట వ్యర్థాలు, అవశేషాలు, వెదురు చాలు. దీనివల్ల పర్యావరణ పరిరక్షణకూ ఆస్కారం ఉంటుంది. పంజాబ్, హరియాణాల్లో ఏటా 3.5కోట్ల టన్నుల వరిగడ్డి ఉత్పత్తి అవుతోంది. అందులో సగం గడ్డిని తగలబెడుతున్నారు. అక్కడ మిగిలే వ్యర్థాలతోనే పదివేల కోట్ల లీటర్ల ఇథనాల్‌ను తయారు చేయవచ్చు. భారత చమురు సంస్థ పానీపట్‌లో రూ.900 కోట్ల పెట్టుబడితో రెండు లక్షల టన్నుల వరిగడ్డిని మూడు కోట్ల లీటర్ల ఇథనాల్‌గా మార్చే రెండోతరం కర్మాగారాన్ని నిర్మించింది. దానివల్ల 63వేల కార్లను రోడ్లపై నుంచి తొలగించినంతగా ఉద్గారాలు తగ్గాయి. దేశవ్యాప్తంగా ఇలాంటి కర్మాగారాలను నిర్మిస్తే భారతదేశ ఇంధన ముఖచిత్రమే మారిపోతుంది. ముఖ్యంగా వెదురు ఆధారిత ఇథనాల్‌కు భారీ అవకాశం లభిస్తుంది. భారత్ ప్రపంచంలోనే రెండో అతిపెద్ద వెదురు ఉత్పత్తిదారు. కానీ, దాంట్లో 70శాతం ఉత్తర, తూర్పు రాష్ట్రాల్లోనే ఉంది. కాబట్టి, వెదురు ఆధారిత ఇథనాల్ కర్మాగారాలను అక్కడ నెలకొల్పితే, తూర్పు భారత అభివృద్ధి కూడా సుసాధ్యమవుతుంది.

అన్నదాతకు రెండు రకాల ఆదాయం

ఇండియా తన ఇథనాల్ లక్ష్యాలను చేరుకోవాలంటే, ముందుగా విక్రయ కేంద్రాలను విరివిగా అందుబాటులోకి తెచ్చేందుకు స్పష్టమైన ప్రణాళిక వేసుకోవాలి. రెండోతరం ఇథనాల్ కర్మాగారాలకు ఆర్థిక లోటును పూడ్చే నిధిని 2028 నుంచి 2035 వరకు పొడిగించాలి. ఈ20 అనుకూల కార్లు తయారైన తరవాత, ఈ30కి అనుకూలమైన కార్ల ఉత్పత్తి కోసం తయారీదారులను ఇప్పుడే ఆదేశించాలి. రాష్ట్రాలు కేవలం పంట వ్యర్థాల దహనాన్ని నిషేధిస్తే సరిపోదు; సరైన ధర చెల్లించి వాటిని సేకరించాలి. ఇథనాల్ వినియోగదారులకు పన్ను మినహాయింపునివ్వాలి. ఇథనాల్ విప్లవంలో రైతు కేవలం ముడిసరకు సరఫరాదారుగానే మిగిలిపోకూడదు. పంట వ్యర్థాలు ఇంధన కర్మాగారాలకు అమ్ముడుపోయిన రోజు అన్నదాతకు రెండు రకాల ఆదాయం సమకూరుతుంది. లీటర్ ఇథనాల్ ఉత్పత్తికి 34 లీటర్ల నీరు అవసరమవుతుంది. కాబట్టి, నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో ఇథనాల్ కర్మాగారాలను నిర్మించడం వ్యూహాత్మక తప్పిదమే అవుతుంది. సున్నా నీటి విడుదల సాంకేతికతను వినియోగించే పానీపట్ కర్మాగారం నమూనానే ప్రతిచోటా అనుసరించడం మేలు. పర్యావరణ పరిరక్షణకూ, అన్నదాతల ఆర్థిక స్వావలంబనకు దోహదపడే ఇథనాల్ తయారీకి ప్రభుత్వాలు సరైన వ్యూహంతో, రైతాంగం భాగస్వామ్యంతో ముందుకు కదలాలి.

# భవితపై బెంగతో కుంగుబాటు

నేడు పిల్లల గురించిన సంభాషణలు ఎక్కువగా మార్కులు, ర్యాంకులు, కోచింగ్ సెంటర్లు, కాలేజీ సీట్లు, ఉద్యోగాలు, జీతాలు, విదేశీ అవకాశాల చుట్టూనే తిరుగుతున్నాయి. దీనంతటికీ కారణం - తమ బిడ్డల భవిష్యత్తు బాగుండాలని తల్లిదండ్రులు తపిస్తుండటమే. అందుకోసం వారు ఎంతో కష్టపడుతున్నారు, ఎన్నో త్యాగాలు చేస్తున్నారు. విద్య అనేది ఒక భద్రత, గౌరవం, భవిష్యత్తుపై ఆశలకు చిహ్నం. కానీ, ఈ ఆకాంక్షల మాటున ఒంటరితనం, భవిష్యత్తుపై భయాందోళనలు యువతను వెంటాడుతున్నాయి.జీవితంలో పోటీ అనేది అనివార్యం. మంచి ఉద్యోగాలు సులభంగా రావు. వాటిని సాధించాలనుకునే వారికి క్రమశిక్షణ, పట్టుదల, కష్టపడటం వంటి లక్షణాలుండాలి. అన్నింటికన్నా ముఖ్యంగా ఆత్మవిశ్వాసం కావాలి. ఇది మార్కులు, శిక్షణ తరగతులు, వ్యక్తిత్వ వికాస ప్రసంగాల నుంచి మాత్రమే రాదు. కష్ట సమయాల్లో మానసికంగా అండ, భావోద్వేగపరంగా భరోసా లభించినప్పుడు పిల్లల్లో ఆత్మవిశ్వాసం క్రమంగా పెరుగుతుంది. నేడు పిల్లలను కోచింగ్ సెంటర్లకు పంపడం, వారిని పర్యవేక్షించడం ఎక్కువవుతున్నాయి. ఆ క్రమంలో పిల్లలపై అంచనాలూ పెరుగుతున్నాయి. అదే సమయంలో, కుటుంబ సభ్యులంతా కూర్చుని ప్రశాంతంగా మాట్లాడుకోవడం తగ్గిపోతోంది. దీనికి తోడు చాలామంది యువకులు మనసులోని బాధను బయటికి చెప్పడం పురుష లక్షణం కాదనుకుంటున్నారు. అది



**చాలా తప్పు. మనసులో గూడుకట్టుకున్న భావోద్వేగాలను పెద్దలతో పంచుకుని మార్గదర్శకత్వం తీసుకోవాలి.**

అపజయాలు సర్వసాధారణం...

'ఫెయిల్ అవ్వకు. ఫలానా వారిని చూసి నేర్చుకో. జనాలు ఏమనుకుంటారు? భవిష్యత్తును పాడు చేసుకుంటున్నావు...' తల్లిదండ్రులు ఇలాంటి మాటలను పిల్లలకు ఆందోళనతో చెబుతుంటారు. దాంతో తల్లిదండ్రులు కనబరిచే ప్రేమ, ఆప్యాయత, గౌరవం కేవలం పరీక్షలు, ఉద్యోగ సాధనలో తాము సాధించే విజయంపైనే ఆధారపడి ఉంటాయని పిల్లలు నమ్మడం ప్రారంభిస్తారు. నిజానికి నేటితరం పిల్లలు మునుపటి తరాలకంటే తెలివైనవారు, నైపుణ్యం కలిగినవారుగా తయారవుతున్నారు. కానీ, జాతీయ నేరగణాంకాల సంస్థ తాజా నివేదిక ఏమో ఏపీ, తెలంగాణ సహా దేశమంతటా విద్యార్థుల ఆత్మహత్యలు గణనీయంగా జరుగుతున్నాయని వెల్లడించింది. దీనర్థం యువత మానసికంగా బలహీనమైపోయిందనీ కాదు, వారి మీద తల్లిదండ్రులకు శ్రద్ధ లేదనీ కాదు. పిల్లలపై తల్లిదండ్రులు చూపే ప్రేమ, వారి నుంచి సామర్థ్యానికి మించి కోరుకోవడం కొన్నిసార్లు ఒత్తిడిగా మారుతోంది. దాంతో మంచి మార్కులు, ర్యాంకులు, పెద్ద ఉద్యోగాలు, భారీ జీతాలే తమకు విలువను తెచ్చిపెడతాయనే భావన బలపడిపోతోంది. అలాంటప్పుడే, 'నేను ఫెయిలైతే ఇక నా జీవితం ముగిసిపోయినట్లే... అమ్మానాన్నలను నిరాశపరిస్తే నాకేం విలువ ఉంటుంది... నాకంటే మిగతావాళ్లు ముందుకెళ్లిపోతున్నారు' అనే ఆలోచనలు పుట్టుకొస్తున్నాయి. అదే విపరీత నిర్ణయాలకు కారణమవుతోంది.

మునుపటి తరాలు కూడా కష్టాలనూ, పోటీనీ ఎదుర్కొన్నాయి. కానీ, నేటి యువత పడుతున్న ఇబ్బందులు వాటికన్నా ఎంతో భిన్నమైనవి. ఫోన్లు, సోషల్ మీడియా ద్వారా విద్యార్థులు నిరంతరం ఇతరుల మార్కులు, విజయాలు, ఉద్యోగాలు, జీవనశైలిని గమనిస్తున్నారు. దాంతో సర్వసాధారణ అపజయాలను కూడా వారు తీవ్ర అవమానాలుగా భావిస్తున్నారు. చాలామంది విద్యార్థులు నిరంతరం ఆన్‌లైన్‌లో ఉండటం వల్ల ఒంటరితనానికి లోనవుతున్నారు. మరికొందరు హాస్టళ్లు, కోచింగ్ సెంటర్లలో చేరడంతో ఇంటికి దూరమవుతున్నారు. ఇంకొందరు తల్లిదండ్రులను నిరాశపరచడం ఇష్టంలేక వారితో మనసువిప్పి సరిగ్గా మాట్లాడలేకపోతున్నారు. నిజానికి నేటితరం పిల్లలకు జీవితంలో చిన్నచిన్న సమస్యలు, ఇబ్బందులు, చికాకులు సర్వసాధారణమనే విషయం తెలియదు. అలాంటివి ఎదురైనప్పుడు తల్లిదండ్రులు వారికి ధైర్యం చెబుతూ, సమస్యల నుంచి గట్టెక్కడమెలాగో; భావోద్వేగాలను ఇతరులతో పంచుకుని తేలికపడటమెలాగో నేర్పించాలి. దాంతో వారు ఒత్తిడి, భయాందోళనల నుంచి బయటపడి, ఒంటరితనానికి దూరమవుతారు. ఇలా పెద్దల అండతో కష్టనష్టాలను ఎదుర్కొంటేనే పిల్లలు మానసికంగా దృఢంగా ఉండగలుగుతారు.

కుటుంబం అండగా ఉంటే...

పిల్లలు ఒత్తిడి, భయాందోళనలకు దూరంగా ఉండాలంటే, వారి తల్లిదండ్రులు మానసిక నిపుణులే కానవసరం లేదు. ప్రతి బిడ్డకూ కనీసం తల్లితోగానీ, తండ్రితోగానీ భయసంకోచాలు లేకుండా, సమస్యలను చెప్పుకోగల స్వేచ్ఛ ఉండాలి. మన సమాజానికి కొన్ని బలాలు ఉన్నాయన్న సంగతిని మర్చిపోకూడదు. భారతీయ కుటుంబాలు ఇప్పటికీ లోతైన అనుబంధాలను కలిగి ఉన్నాయి. తాతయ్యలు, అమ్మమ్మ నానమ్మలు, ఇతర బంధువులు, కుటుంబ స్నేహితులు, ఉపాధ్యాయులు యువతకు వెన్నుదన్నుగా నిలవడంలో కీలకమవుతారు. కష్టకాలంలో ఒక శ్రద్ధగల ఉపాధ్యాయుడు, అర్థం చేసుకునే బాబాయి/మావయ్య, ఓపిక గల తాతయ్య/అమ్మమ్మ, నమ్మకమైన అన్నయ్య/అక్క... ఇలా ఎవరైనా తోడుంటే చాలు; పిల్లవాడు త్వరగా తేరుకుని మళ్లీ ముందుకెళ్లగలుగుతాడు. ఎప్పుడుచూసినా 'నీకెన్ని మార్కులొచ్చాయి? ఎంత ర్యాంకు వచ్చింది?' అని కాకుండా... 'నీకేమైనా ఇబ్బంది ఉందా? దేని గురించైనా ఆందోళన చెందుతున్నావా? ఒత్తిడికి లోనైనప్పుడు ఎవరితో మాట్లాడతావు? నిరాశ నుంచి కోలుకోవడానికి ఏం చేస్తుంటావు?' అని కూడా అడగడం చాలా అవసరం. యువతీయువకులు కూడా పరీక్ష ఫెయిలవడం, అవకాశం కోల్పోవడం వంటి తాత్కాలిక అపజయాలు జీవితాశయాలకు ముగింపు పలకవని గ్రహించాలి. వాటి నుంచి తేరుకోవడానికి ఇతరులను సాయం అడగడం బలహీనత కానేకాదు. నమ్మకమైన స్నేహితులు, ఉపాధ్యాయులు, బంధువులు, మార్గదర్శకులు, కౌన్సిలర్లతో మాట్లాడటం పెద్ద మార్పు తెస్తుంది. సాయంత్రం పూట అంతా కలిసి కాసేపు నడకకు వెళ్లడం, పరీక్ష ఫలితాల తరవాత ప్రశాంతంగా సంభాషించడం, ఫోన్లు పక్కనపెట్టి కలిసి భోజనం చేయడం, వెంటనే సలహాలు ఇచ్చేయకుండా పిల్లలు చెప్పేది ఆలకించడం ఇలాంటివన్నీ పిల్లలు, యువతలో మెండుగా ఆత్మవిశ్వాసాన్ని నింపుతాయి. అప్పుడే వారు మనోనిబ్బరంతో విజయతీరాలను అందుకోగలుగుతారు.

# వ్యూహాత్మక భాగస్వామ్యాలకు పెద్దపీట!

హిందూ మహాసముద్ర ప్రాంతంలో ప్రాబల్య విస్తరణకు చైనా కొన్నేళ్లుగా తహతహలాడుతోంది. ఆ దేశంతో వాణిజ్య యుద్ధం సంగతి ఎలా ఉన్నప్పటికీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తరచూ 'జీ-2' ప్రస్తావన చేస్తూ బీజింగ్‌ను మచ్చిక చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఎవరికీ అంతుచిక్కని తన వ్యవహారశైలితో 'క్వాడ్' భవితవ్యాన్ని ప్రశ్నార్థకంగా మారుస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇండోనేసియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లలో మోదీ పర్యటనలు- పలు కీలకాంశాల్లో సత్ఫలితాలను రాబట్టాయి. అంతర్జాతీయ సరకు రవాణాకు కూడలి లాంటి మలక్కా జలసంధికి సమీపంలో ఇండోనేసియా ఉంది. అక్కడ కొన్నాళ్లుగా చైనా నౌకాదళ ఉనికి పెరుగుతోంది. ఈ నేపథ్యంలో సముద్ర భద్రతకు సమష్టిగా పరిశ్రమించడానికి, తీర రక్షక దళాల నడుమ సహకారాన్ని పెంపొందించుకోవడానికి దిల్లీ-జకార్తా అంగీకరించడం- డ్రాగన్ దుస్సాహసాలను నిలువరించడానికి తోడ్పడుతుంది. నికెల్ వంటి కీలక ఖనిజ సరఫరా గొలుసులను పటిష్ఠపరచుకోవాలన్న నిర్ణయం- భారత ఈవీ, హైటెక్ పరిశ్రమలకు కొత్త బలాన్నిస్తుంది. బ్రహ్మోస్, అస్త్ర క్షిపణుల కొనుగోలుకు ఇండోనేసియా ముందుకు రావడం- ప్రపంచ రక్షణరంగ ఎగుమతుల్లో తన వాటాను పెంచుకోవాలనుకుంటున్న భారతావని లక్ష్యాల సాకారానికి ఊతమిస్తుంది!

దక్షిణ చైనా సముద్ర ప్రాంతంలో డ్రాగన్ ఆగడాలు మితిమీరుతున్నాయి. దాంతో స్వేచ్ఛాయుతమైన, నియమబద్ధమైన ఇండోపసిఫిక్ కోసం గళమెత్తుతున్న ఇండియా, ఆస్ట్రేలియా ఉమ్మడి సంకల్పాల సాధనకోసం మరింతగా చేరువవుతున్నాయి. ఆసీస్ ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌తో మోదీ భేటీ సందర్భంగా రక్షణ సంబంధాలను సరికొత్త దశకు తీసుకెళ్లేందుకు ఇరు




దేశాలు సమ్మతించాయి. తద్వారా సాగర భద్రతలో, రక్షణ ఉత్పత్తుల అభివృద్ధిలో చేయిచేయి కలిపి ముందడుగు వేయడం సాధ్యమవుతుంది. ఆస్ట్రేలియా నుంచి లిథియం, కోబాల్ట్ వంటి అరుదైన ఖనిజాల సరఫరాలు జోరందుకుంటే, వాటికోసం చైనావైపు చూడాల్సిన అగత్యం ఇండియాకు కొద్దిమేర తప్పుతుంది. దేశీయ అవసరాలకు ఏ లోటూ లేకుండా చూస్తూనే కర్బన ఉద్గారాలను తగ్గించాలన్న ఉద్దేశంతో అణువిద్యుత్‌కు ఇండియా ప్రాధాన్యమిస్తోంది. ఈ క్రమంలో కాన్‌బెర్రాతో పుష్కర కాలం కిందట కుదిరిన పౌర అణు సహకార ఒప్పందం ఇప్పుడు కొలిక్కిరావడం హర్షణీయం. శుద్ధ ఇంధన రంగంలో భారతావని స్వావలంబన సాధించడానికి అది ఇతోధికంగా సాయపడుతుందన్నది వాస్తవం!

గడచిన నాలుగు దశాబ్దాల్లో న్యూజిలాండ్‌లో పర్యటించిన మొదటి భారత ప్రధానిగా నిలవడం ద్వారా 'యాక్ట్‌ఈస్ట్' నుంచి 'యాక్ట్ పసిఫిక్'కు విస్తరించిన ఇండియా వ్యూహాన్ని మోదీ తెలియజెప్పారు. ఇండోపసిఫిక్‌లో ఉభయతారక దీర్ఘకాలిక స్నేహబంధాల వృద్ధి పట్ల భారతదేశ అనురక్తిని ఆయన చాటిచెప్పారు. ఈ సందర్భంగా ఆర్థిక, రక్షణ, సాంకేతిక సంబంధాలను సుదృఢపరచుకునేందుకు ఇండియా, న్యూజిలాండ్ స్పష్టమైన కార్యాచరణను ప్రకటించడం ప్రశంసనీయం. 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యం ద్విగుణీకృతం కావాలన్న స్వప్నం నెరవేరాలంటే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం త్వరగా పట్టాలకెక్కాలి. విశ్వసనీయ మిత్రదేశాలతో వ్యూహాత్మక భాగస్వామ్యాలను బలోపేతం చేసుకోవడం ద్వారానే భౌగోళికంగా తనకు ఎదురయ్యే సవాళ్లను ఇండియా దీటుగా ఎదుర్కోగలదు. స్వప్రయోజనాల కోసం వెంపర్లాడే అమెరికా, చైనాల ఎత్తుగడలను సమర్థంగా కాచుకుంటూ ఇండోపసిఫిక్‌లో నిర్ణయాత్మక శక్తిగా ఎదగగలదు. భారత్‌తో సత్సంబంధాలకు మొగ్గుచూపుతున్న మూడు దేశాలను ప్రధాని మోదీ సందర్శించడం ఇందుకు ఉపకరించిందనడంలో ఎటువంటి సందేహం లేదు!

## నేరాల నియంత్రణలో రాజీ పడకుండా, ప్రజల భద్రతే

# పోలీసుల తొలి బాధ్యతగా వ్యవహరించాలి



**– జిల్లా ఎస్పీ సతీష్ కుమార్...**

**పుట్టపర్తి రూరల్ జూలై 25 అనంత జన శక్తి న్యూస్.**

"నేరస్తులకు పోలీసులంటే భయం ఉండాలనీ నేరాల నియంత్రణలో ఎలాంటి రాజీ పడకుండా, ప్రజల భద్రతే మన తొలి బాధ్యతని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్,స్పష్టం చేశారు. జిల్లాలో ఆస్తి సంబంధిత నేరాలు, మహిళలు , చిన్నారులపై జరిగే అరాచకాల నియంత్రణకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తూ ప్రతి పోలీసు అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు.

పుట్టపర్తిలోని సాయి ఆరామంలో జిల్లా ఎస్పీ అధ్యక్షతన అర్ధవార్షిక నేర సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో డీడీఓ, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, జిల్లా పోలీసు అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పెండింగ్ కేసులు, పోక్సో, వైట్ కాలర్, హత్య, మిస్సింగ్ కేసులతో పాటు రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల కదలికలు, దర్యాప్తు పురోగతి , కోర్టు విచారణలపై జిల్లా ఎస్పీ సమగ్రంగా సమీక్షించారు. చోరీలు, చైన్ స్నాచింగ్ కేసులను వేగంగా ఛేదించి ఆస్తులను రికవరీ చేసి బాధితులకు అందజేయాలని, ప్రాపర్టీ నేరస్తులకు కౌన్సెలింగ్ ఇస్తూ నిరంతర నిఘా ఉంచాలని సూచించారు. సమాజానికి హానికరంగా మారే పాత నేరస్తులపై బైండోవర్ కేసులు నమోదు చేయాలని, అవసరమైతే పీడీ యాక్ట్ అమలు చేయడానికి కూడా వెనుకాడొద్దని స్పష్టం చేశారు.మహిళలు, చిన్నారుల రక్షణ కోసం గ్రామాలు, పాఠశాలల్లో విస్తృత అవగాహన సదస్సులు నిర్వహించాలని, పోక్సో కేసుల దర్యాప్తును వేగవంతం చేస్తూ సీసీటీఎన్ఎస్‌లో వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు.

మరోవైపు రోడ్డు ప్రమాదాల నివారణకు హైవే పెట్రోలింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం కొనసాగించాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. రాత్రిపూట అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులపై డేగకన్ను ఉంచాలని, సరిహద్దు చెక్‌పోస్టులు, నైట్ బీట్‌లను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. పక్కా శాస్త్రీయ ఆధారాల సేకరణ ద్వారా కోర్టుల్లో శిక్షల శాతం పెంచడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అలాగే రద్దీ ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటును వేగవంతం చేయడంతో పాటు, అవసరమైన సున్నిత ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా నిఘా పెట్టాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో భూవివాదాలు తలెత్తకుండా స్థానిక పోలీసులు రెవెన్యూ శాఖతో సమన్వయం చేసుకుని ముందస్తు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ (డీడీఓ) శ్రీ రామ్ నాయక్ మాట్లాడుతూ భారతీయ నాగరిక సురక్ష సంహిత బి ఎన్ ఎస్ ఎస్ తో పాటు కొత్త క్రిమినల్ చట్టాల అమలు, శాస్త్రీయ సాక్ష్యాల సేకరణ, చార్జిషీట్ దాఖలు విధానాలపై అధికారులకు అవగాహన కల్పించారు. పెనుకొండ హైవే రాబరీ కేసును అత్యంత చాకచక్యంగా ఛేదించిన సిఐలు రాఘవన్, ఆంజనేయులు, రాజ్ కుమార్, ఇస్మాయిల్, గోపీనాథ్ రెడ్డి, ఎస్ఐలు ముని ప్రతాప్, మక్బుల్ భాష, రంగడు యాదవ్, రాజేష్ను ఓజి టీమ్‌ను ప్రత్యేకంగా సత్కరించి ప్రశంసాపత్రాలతో పాటు క్యాష్ రివార్డులు అందజేశారు. అనంతరం, నాణ్యమైన దర్యాప్తు ద్వారా నేరస్తులకు శిక్షలు పడేలా చేసిన అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లను, అదేవిధంగా గ్యాంగ్ రేప్ కేసులో కీలకంగా పనిచేసిన హిందూపురం రూరల్ సీఐ జనార్ధన్, ఎస్ఐ మునీర్ అహమ్మద్ ను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఏవో వేణుగోపాల్ ఏఆర్డిఎస్పి శ్రీనివాసుల విధి నిర్వహణలో ప్రతిభను గుర్తించి ప్రశాంత పత్రాలను అందజేశారు.ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించడమే లక్ష్యంగా అంకితభావంతో పనిచేయాలని ఎస్పీ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు అంకిత సురాన, కే.వి. మహేష్, డీఎస్పీ శివనారాయణస్వామి, లీగల్ అడ్వైజర్ సాయినాథ్ రెడ్డి, ఏవో వేణుగోపాల్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు దుర్గాదేవి, శ్రీనివాసులు, నాగేష్, భాను, సుచిత్ర, ఆదినారాయణమ్మ, ప్రత్యూష తదితర సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

# ఆలయ అభివృద్ధికి కృషి చేయండి

**- పాలక మండలికి మంత్రి సూచన**

**నెల్లూరు, జూలై 25:అనంత జనశక్తి న్యూస్**



నెల్లూరు నగరంలోని 125 సంవత్సరాల చరిత్ర కలిగిన సంతపేట శ్రీ ఆంజనేయస్వామి ఆలయ నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.సతీమణి రమాదేవితో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మంత్రి దంపతులకు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు.నూతన పాలకమండలి చైర్మన్ ముప్పాళ్ల విజేతా రెడ్డి, సభ్యులు శివ ప్రదీప్, జీత్ సింగ్, చైతన్య, విజయ్‌కుమార్, లతేష్, శిల్పా, శిరీషాతో పాటు ఎక్స్అఫీషియో సభ్యులను మంత్రి దంపతులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు .ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ 125 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ పవిత్ర క్షేత్రం నూతన పాలకమండలి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. బాధ్యతలు స్వీకరించిన చైర్మన్ ముప్పాళ్ల విజేతా రెడ్డి, సభ్యులు స్వామివారి ఆశీస్సులతో ఆలయ అభివృద్ధికి అంకిత భావంతో కృషి చేయాలని ఆకాంక్షించారు. 1891లో ఆలయ నిత్య నైవేద్యాల కోసం భూదానం చేసిన రంగారావు, జింక వాహనోత్సవం కోసం తన ఇంటిని దానం చేసిన ములుమూడి సుబ్బమ్మ చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని కొనియాడారు. వారి త్యాగస్ఫూర్తి భావితరాలకు ఆదర్శమని పేర్కొన్నారు.రహదారి కంటే మూడు అడుగుల లోతులో ఉన్న ఆలయాన్ని 2017లో భక్తుల సహకారంతో తొమ్మిది అడుగుల ఎత్తుకు పెంచి పునర్నిర్మించడం చారిత్రక ఘట్టమని మంత్రి అన్నారు. ప్రతి మంగళవారం నిర్వహించే పల్లకీ సేవ, శ్రీరామనవమి సందర్భంగా జరిగే తొమ్మిది రోజుల బ్రహ్మోత్సవాలు, హనుమజ్జయంతి, చైత్ర శుద్ధ పౌర్ణమి రథోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పాలక మండలి సేవాభావంతో పనిచేయాలని సూచించారు. ప్రతి ఏడాది భక్తుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఆలయంలో మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.ఆంజనేయస్వామి భక్తికి ప్రతిరూపం, ధైర్యానికి ప్రతీక, సేవకు నిదర్శనమని పేర్కొంటూ, ఆయన చూపిన మార్గంలో నడిస్తే సమాజంలో ఐక్యత, క్రమశిక్షణ, సేవాభావం మరింత పెరుగుతాయని అన్నారు. నూతన పాలకమండలి ఆలయ అభివృద్ధితో పాటు ధార్మిక కార్యక్రమాలను మరింత వైభవంగా నిర్వహించి ఈ క్షేత్రానికి మరింత గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో మేయర్ దేవరకొండ సుజాత, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, నారాయణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, రాష్ట్ర వేర్‌హౌస్ కార్పొరేషన్ డైరెక్టర్ కపిర శ్రీనివాసులు, టీడీపీ మహిళా నేత కపిర రేవతి, బీజేపీ నేతలు సురేంద్రరెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, జనసేన నేత దుగ్గిశెట్టి సుజయ్‌బాబు, టీడీపీ నేతలు కిన్నెర ప్రసాద్, డీవీఎస్ గిరి తదితరులు పాల్గొన్నారు.

# రూ.40.32 లక్షల నిధులతో ఎస్సీ హాస్టళ్ల అభివృద్ధి



**- మంత్రి కందుల దుర్గేష్**

**- త్వరలోనే నిడదవోలు నియోజకవర్గంలోని సాంఘిక సంక్షేమ హాస్టళ్లపై ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహిస్తామని ప్రకటన**

**నిడదవోలు జూలై 25 అనంత జనశక్తి న్యూస్**

సమాజంలో పేదరికాన్ని జయించి, ఉన్నత స్థానాలకు ఎదగడానికి చదువు ఒక్కటే ఏకైక మార్గమని భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆనాడే స్పష్టం చేశారని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. శనివారం పెరవలి మండలం కానూరులోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు .ఈ సందర్భంగా కానూరు, ఉండ్రాజవరం, ఖండవల్లి, సమిశ్రగూడెం తదితర ప్రభుత్వ సాంఘిక సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు టవల్స్, నైట్ డ్రస్సులు, స్వెటర్లు, దుప్పట్లు, బెడ్ షీట్లు, ప్లేట్లు, గ్లాసులు మరియు మెటీరియల్ కిట్లను మంత్రి కందుల దుర్గేష్ స్వయంగా పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ..రాబోయే రోజుల్లో నిడదవోలు నియోజకవర్గంలోని సాంఘిక సంక్షేమ హాస్టళ్ల పనితీరు, మౌలిక వసతులపై అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహిస్తానని ప్రకటించారు. దళిత, వెనుకబడిన వర్గాల సంక్షేమానికి, హాస్టళ్ల రూపురేఖలు మార్చడానికి సమగ్ర కార్యచరణ రూపకల్పన చేస్తామని పునరుద్ఘాటించారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ .. ఆర్థిక లేమి కారణంగా వెనుకబడిన, దళిత వర్గాల పిల్లలు అవకాశాలకు దూరం కాకూడదనే ఉద్దేశంతో సాంఘిక సంక్షేమ హాస్టళ్ల నిర్వహణను ప్రభుత్వం మరింత పటిష్టం చేస్తోందన్నారు. సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామితో ప్రత్యేకంగా చర్చించి నియోజకవర్గ పరిధిలోని హాస్టళ్ల అభివృద్ధికి రూ.40.32 లక్షలు మంజూరు చేయించినట్లు తెలిపారు.అందులో భాగంగా సమిశ్రగూడెం ఎస్సీ హాస్టల్ కు రూ.22.15 లక్షలు, కానూరు ఎస్సీ హాస్టల్ కు రూ.12 లక్షలు, ఖండవల్లి ఎస్సీ బాయ్స్ హాస్టల్ (ప్రీమెట్రిక్)కు రూ. 6.17 లక్షలు మంజూరు చేయించానన్నారు. ఈ నిధులతో వసతి గృహాల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పన, మరమ్మత్తులు చేపడుతున్నామని వివరించారు. అలాగే స్థానిక దళిత యూత్, మహిళలు కోరిన విధంగా నూతన భవనాల నిర్మాణాలు, లీకేజీల నివారణ, కొత్త హాస్టళ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి సాధించేందుకు కృషి చేస్తానన్నారు.విద్యార్థులు ఎలాంటి ఆత్మన్యూనతా భావానికి గురికాకుండా, బలమైన ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలని మంత్రి దుర్గేష్ పిలుపునిచ్చారు. ప్రణాళికాబద్ధంగా కష్టపడి చదివితే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా, గొప్ప క్రీడాకారులుగా నిలిచి సమాజంలో ఉన్నత స్థానాలు సాధించవచ్చని ఆకాంక్షించారు. కూటమి ప్రభుత్వం ప్రాథమిక స్థాయి నుండి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు నాణ్యమైన విద్య, యూనిఫామ్‌లు, పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందిస్తూ సంపూర్ణ అండగా నిలుస్తోందని స్పష్టం చేశారు.

# ఎర్రచందనం అక్రమ రవాణా ముఠాలకు సహకరిస్తే ఎవరినైనా ఉపేక్షించం

**- అంతరాష్ట్ర స్మగ్లర్లకు సహకరించిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పాత్రపై లోతుగా దర్యాప్తు**

**- ఎర్ర చందనం అక్రమ రవాణాని అరికట్టేందుకు మరింత కఠిన చర్యలు**

**కడప జూలై 25, అనంత జనశక్తి న్యూస్**




ఎర్రచందనం అక్రమ రవాణా ముఠాలకు సహకరిస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదని రాష్ట్ర ఉపముఖ్యమంత్రివర్యులు, అటవీ పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ హెచ్చరించారు. ఎర్రచందనం స్మగ్లింగ్‌ను పతిశాతంగా నిరోధించేందుకు మరింత కఠినమైన ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఎర్రచందనం స్మగ్లింగ్ ను అరికట్టేందుకు చేపట్టిన ఆపరేషన్ అరణ్య పని తీరును ఎప్పటికప్పుడు సమీక్షిస్తానని తెలిపారు. శనివారం, కడప జిల్లా అవదూత కాశినాయన మండల పరిధిలోని వరికుంట్ల గ్రామ సమీపంలోని జ్యోతి గుడి వద్ద రూ.1.5 కోట్ల విలువైన 78 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్న ఘటనపై ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం అధికారులతో మాట్లాడారు. ఇద్దరు అంతర్రాష్ట్ర స్మగ్లర్లతోపాటు వారికి సహకరిస్తున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌ను అరెస్టు చేసిన విషయాన్ని ఉప ముఖ్యమంత్రివర్యులకు అధికారులు తెలియచేశారు. ఈ ఘటన పూర్వాపరాలను వివరించారు.శనివారం తెల్లవారుజామున ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం, స్టేట్ ఇంటెలిజెన్స్ బృందానికి అందిన కచ్చితమైన సమాచారం ఆధారంగా వరికుంట్ల గ్రామ సమీపంలో వాహనాల తనిఖీలు చేపట్టామన్నారు.

ఈ సందర్భంగా బొలెరో మ్యాక్స్ ట్రక్కులో ఇంటి సామగ్రి ముసుగులో ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలిస్తున్న హర్యానాకు చెందిన ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1.5 కోట్ల విలువైన 78 ఎర్రచందనం దుంగలు, వాహనాన్ని స్వాధీనం చేసుకుని, సన్నీ, రమేష్ అనే ఇద్దరిని అరెస్టు చేసినట్లు వివరించారు. విచారణలో జ్యోతి ఫారెస్ట్ బీట్‌లో బీట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న మల్లికార్జునుడు అక్రమ రవాణా ముఠాలకు సహకరిస్తున్నట్లు గుర్తించామని,

వెంటనే అతడిని కూడా అరెస్టు చేసి విచారిస్తున్నట్టు వెల్లడించారు. బెంగళూరు, హర్యానా, కోల్‌కతా ప్రాంతాల్లో వీరికి సహకరిస్తున్న మరికొందరు ప్రధాన సూత్రధారులను గుర్తించినట్లు తెలిపారు.ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఆ ప్రధాన సూత్రధారులను పట్టుకోవాలని ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ ఆదేశించారు. బీట్ ఆఫీసర్ పాత్రపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలన్నారు.

## పాముకాటుతో వీఆర్ఏ దేవదాస్ మృతి



**తలుపుల జులై25 అనంత జనశక్తి న్యూస్**

మండల పరిధిలోని పులిగింఢ్లపల్లి వీఆర్ఏ గా పని చేస్తున్నటువంటి దేవదాస్(45) సంవత్సరాలు ఈరోజు విధులు నిర్వహించి సాయంత్రం సమయంలో తన పొలంలోకి వెళ్లినప్పుడు పాము కలవడంతో మృతి చెందారు. వీఆర్ఏ దేవదాస్ కు ఇద్దరు పిల్లలు. గత ఎన్నో సంవత్సరాల నుంచి వీఆర్ఏగా పనిచేస్తున్న దేవదాస్ ప్రజల మన్నికను కూడగట్టుకున్నారు.అకస్మాత్తుగా మృతి చెందడంతో కుటుంబ అతలాకుతల అయిందని భార్య దుఃఖాంతికి లోనైనది.

## జిల్లాలో 'ఆపరేషన్ నైట్ సేఫ్టీ' ముమ్మరం



**అనంతపురం, జూలై 25:అనంత జనశక్తి న్యూస్**

జిల్లాలో రాత్రి వేళల్లో నేరాలను అరికట్టడం, ప్రజలకు భద్రత కల్పించడమే లక్ష్యంగా జిల్లా పోలీసు అధికారి పి. జగదీష్ ఆదేశాల మేరకు 'ఆపరేషన్ నైట్ సేఫ్టీ' ముమ్మరంగా కొనసాగుతోంది. ఈ ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పోలీసులు విస్తృతంగా గస్తీ నిర్వహిస్తూ అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు.రాత్రి వేళల్లో బ్యాంకులు, నగదు యంత్రాలు, ప్రముఖ దేవాలయాల వద్ద భద్రతా ఏర్పాట్లను పోలీసులు పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన నిఘా కెమెరాలు, హెచ్చరిక వ్యవస్థలు, భద్రతా సిబ్బంది పనితీరును క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు.గస్తీ సమయంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వివరాలను పరిశీలించారు. అనంతరం వారికి హెచ్చరికలు జారీ చేసి పంపించారు. అలాగే బస్సు నిలయాలు, రైల్వే స్టేషన్లు, నిర్మానుష్య ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు.ఎలాంటి సరైన కారణం లేకుండా అర్ధరాత్రి వేళల్లో రోడ్లపై సంచరిస్తున్న వారిపై ప్రత్యేక నిఘా కొనసాగుతోంది. ఇలాంటి వారిని అదుపులోకి తీసుకుని విచారించి అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు.అదేవిధంగా ప్రధాన కూడళ్ల వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తూ మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై ప్రత్యేక దృష్టిసారించారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ ప్రజల ప్రాణాలకు ప్రమాదం కలిగించే వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు.

## బ్రహ్మంగారిమఠంలో ఘనంగా 'తొలి ఏకాదశి' వేడుకలు



**- పీఠాధిపతులు శ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వాముల వారి ఆధ్వర్యంలో 24 గంటల అఖండ భజన ప్రారంభం**

**బ్రహ్మంగారిమఠం జులై 25, అనంత జనశక్తి న్యూస్**

జగద్గురు శ్రీశ్రీశ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామివారి మఠంలో 'తొలి ఏకాదశి' పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తిశ్రద్ధల నడుమ ఆధ్యాత్మిక కార్యక్రమాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. శనివారం తొలి ఏకాదశి సందర్భంగా మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వాములవారు స్వామివారి మండపంలో శ్రీ గోవిందమాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వార్ల దివ్య మూర్తులకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి కృప అందరికీ కలగాలని ఆకాంక్షిస్తూ "అఖండ ఏక నామస్మరణ భజన" కార్యక్రమాన్ని పీఠాధిపతులు లాంఛనంగా ప్రారంభించారు. 24 గంటల అఖండ భజన మహోత్సవం: ఈ ఆధ్యాత్మిక భజన కార్యక్రమం జూలై 25 శనివారం ఉదయం 6:30 గంటలకు ప్రారంభమై, జూలై 26 ఆదివారం ఉదయం 6:30 గంటల వరకు 24 గంటల పాటు అఖండంగా కొనసాగుతుందని మఠం యాజమాన్యం వెల్లడించింది.

**కన్నులపండువగా భజన బృందాల నామస్మరణ:**

ఈ భజన మహోత్సవంలో బ్రహ్మంగారిమఠం మండలంలోని వివిధ గ్రామాల నుంచి విచ్చేసిన భజన బృందాలు విశేషంగా పాల్గొన్నాయి. ముఖ్యంగా బ్రహ్మంగారిమఠం, సోమిరెడ్డిపల్లె, నరసన్నపల్లె, గంగిరెడ్డిపల్లె గ్రామాలకు చెందిన భజన బృందాల సంకీర్తనలు, తాళ మృదంగ ధ్వనులతో మఠ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక శోభతో విలసిల్లింది.

ఈ కార్యక్రమంలో మఠం సిబ్బంది, మండల నలుమూలల నుంచి విచ్చేసిన వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## కేంద్రానికి యువత గుణపాఠం చెప్పింది

**న్యూఢిల్లీ, జులై 25, అనంతజనశక్తి న్యూస్**

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంపై కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ హర్షం వ్యక్తం చేశారు. ఇది దేశ యువత సాధించిన విజయమని ఆమె పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల ఆకాంక్షలే అంతిమమని, యువత తమ గళాన్ని వినిపించి కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం చెప్పిందని అన్నారు. విద్యా వ్యవస్థలో నెలకొన్న సమస్యలపై విద్యార్థులు చేసిన పోరాటం ఫలించిందని ప్రియాంక గాంధీ వ్యాఖ్యానించారు.

విద్యార్థుల విజయం: ఖర్గే

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా ఈ అంశంపై స్పందిస్తూ.. ఇది కోట్లాది మంది విద్యార్థుల విజయమని తెలిపారు. విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాలనే లక్ష్యంతో విద్యార్థులు పెద్ద ఎత్తున ఉద్యమించారని, వారి పోరాటం దేశవ్యాప్తంగా చర్చకు దారితీసిందని అన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం మరింత బాధ్యతగా వ్యవహరించాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. విద్యా వ్యవస్థలో పారదర్శకత, నాణ్యత పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.




# ఎస్ఐఆర్‌పై దృష్టి సారించాలి: రేగా కాంతారావు

- ప్రతి బూత్‌లో ఓటర్ల నమోదు పూర్తి చేయాలని బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపు
- ఓటు కోల్పోతే మళ్లీ నమోదు ప్రక్రియ క్లిష్టం.. అప్రమత్తంగా ఉండాలని సూచన

**మణుగూరు, జూలై 25, అనంత జనశక్తి న్యూస్ :**

ఎస్ఐఆర్ ప్రక్రియ చివరి దశకు చేరుకున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఓటరు నమోదు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, పినపాక మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు అన్నారు. శనివారం మణుగూరు లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలోని 68 బూత్‌ల పరిధిలో పార్టీ శ్రేణులు తమ కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు, బస్తీ ప్రాంతాల ప్రజలు సహా ప్రతి అర్హుడి ఓటు నమోదు అయ్యేలా కృషి చేయాలని సూచించారు. ఓటరు నమోదు విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా ఓటు కోల్పోయే అవకాశం ఉందని, అనంతరం మళ్లీ నమోదు చేయించుకోవడానికి క్లిష్టమైన ప్రక్రియను ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. కొన్ని బూత్‌లలో ఓటరు నమోదు శాతం తక్కువగా ఉన్నట్లు గుర్తించి, అలాంటి బూత్‌లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మండల నాయకులకు ఆదేశించారు. ఈ సమావేశంలో సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ పోశం నరసింహారావు, ముత్యం బాబు, వట్టం రాంబాబు, నూకారపు రమేష్, ఎడ్ల శ్రీనివాస్, అడపా అప్పారావు, యాదగిరి గౌడ్, ఆవుల నరసింహారావు, అక్కి నరసింహారావు, జావిద్ భాష తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక లారీలతో నిత్యం మృత్యు ఛాయలు

- ప్రధాన రహదారిపై ఇష్టారాజ్యంగా లారీల సంచారం
- మితిమీరిన వేగంతో ప్రమాదాలు
- ఒకే రహదారిపై మూడు లారీల ప్రయాణం
- ప్రాణాలు తీస్తున్న ఇసుక లారీల నిర్లక్ష్యం

**మణుగూరు, జూలై 25, అనంత జనశక్తి న్యూస్:**

మణుగూరు ప్రాంతంలోని ఇసుక ర్యాంపులకు రాకపోకలు సాగిస్తున్న భారీ ఇసుక లారీలు ప్రజలకు ముప్పుగా మారుతున్నాయి. ప్రధాన రహదారులపై ఎక్కడపడితే అక్కడ లారీలను నిలిపివేయడం, ఒకే రహదారిపై ఒకేసారి మూడు లారీలు ప్రయాణించడం, అధిక వేగంతో దూసుకెళ్లడం వల్ల వాహనదారులు, పాదచారులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. శనివారం ఇసుక లారీ ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనతో స్థానికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. గతంలో కూడా ఇదే మార్గంలో పలువురు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోగా, మరికొందరు శాశ్వత వికలాంగులుగా మారిన ఘటనలు చోటుచేసుకున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక లారీలు రహదారులపై వరుసగా నిలిపివేయడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలకు దారి లేక ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ద్విచక్ర వాహనదారులు, పాఠశాల విద్యార్థులు, ఉద్యోగులు, సాధారణ ప్రయాణికులు నిత్యం ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా రద్దీ సమయాల్లో భారీ లారీలు వరుసగా సంచరిస్తుండటంతో చిన్న వాహనాలకు పక్కకు తప్పుకునే అవకాశం లేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రహదారి మొత్తం లారీలతో నిండిపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ఇసుక లారీల రాకపోకల వల్ల ఏర్పడుతున్న ప్రమాదకర పరిస్థితులపై శాశ్వత పరిష్కారం చూపాలని, ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.





# ఓటరు నమోదు వేగవంతం చేయాలి: జూపల్లి రమేష్ బాబు

- ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతిపై తహసీల్దార్‌తో సమీక్ష
- అశ్వరావుపేటలో 86 శాతం ఓటరు నమోదు పూర్తి

**అశ్వరావుపేట, జూలై 25, అనంత జనశక్తి న్యూస్**

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్) పురోగతిపై అశ్వరావుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు శనివారం తహసీల్దార్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ డి. కిషోర్‌ను కలిసి ఓటరు నమోదు కార్యక్రమం పురోగతిని అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ డి. కిషోర్ మాట్లాడుతూ, అశ్వరావుపేట మున్సిపాలిటీ పరిధిలో ఎస్ఐఆర్ ఓటరు నమోదు ప్రక్రియ 86 శాతం పూర్తయిందని, మిగిలిన ప్రక్రియను కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జూపల్లి రమేష్ బాబు మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు నమోదును పూర్తి చేసుకోవాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిన్నంశెట్టి సత్యనారాయణ, మండల బీఎల్ఏ ఇన్‌చార్జి చీకటి శ్రీనివాసరావు, మున్సిపల్ కౌన్సిలర్లు మిండా హరిబాబు, నక్క సత్యనారాయణ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నండ్రు రమేష్, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.



# పోలీస్ అక్క కార్యక్రమాన్ని సమర్థంగా అమలు చేయాలి

- మహిళా పోలీసులకు ఎస్పీ రోహిత్ రాజు ప్రత్యేక అవగాహన
- మహిళలు, బాలికల భద్రతే పోలీస్ అక్క కార్యక్రమం లక్ష్యం

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, జూలై 25, అనంత జనశక్తి న్యూస్ :**




జిల్లాలో అమలు చేయనున్న "పోలీస్ అక్క" కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో మహిళా పోలీసు సిబ్బందికి ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో నియమితులైన మహిళా పోలీస్ కానిస్టేబుళ్లు "పోలీస్ అక్క"గా విద్యాసంస్థలను క్రమం తప్పకుండా సందర్శించి విద్యార్థులతో స్నేహపూర్వకంగా మమేకమై వారి సమస్యలను తెలుసుకోవాలని సూచించారు. మహిళల భద్రత, బాలల రక్షణ, సైబర్ నేరాల నివారణ, పోక్సో చట్టం, మాదకద్రవ్యాల దుష్పరిణామాలు, ర్యాగింగ్ నిరోధం, బుల్లీయింగ్, ఈవ్‌టీజింగ్, స్టాకింగ్, బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను నిర్భయంగా పోలీసులకు తెలియజేసేలా వారిలో విశ్వాసం పెంపొందించాలని సూచించారు. అలాగే, ఏదైనా నేరానికి సంబంధించిన సమాచారం అందిన వెంటనే సంబంధిత షీటీమ్, ఎస్‌హెచ్‌ఓకు సమాచారం అందించి చట్టపరమైన చర్యలు తీసుకునేలా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. విద్యాసంస్థలతో నిరంతర సంబంధాలు కొనసాగిస్తూ, "పోలీస్ అక్క" కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడంలో ప్రతి మహిళా పోలీసు కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీసీఆర్‌బీ డీఎస్పీ మల్లయ్య స్వామి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, షీటీమ్ ఎస్‌హెచ్‌ఓ రమాదేవి, మహిళా పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళా కార్మికురాలికి న్యాయం చేయాలి

- విధుల్లోకి తీసుకోకపోతే నిరాహార దీక్షలు
- ఎస్ఎంఎస్ యాజమాన్యంపై మహిళా మండలి ఆగ్రహం

**మణుగూరు, జులై 25, అనంత జనశక్తి న్యూస్ :**



ఎస్ఎంఎస్ ప్లాంట్‌లో పనిచేస్తున్న మహిళా కార్మికురాలిపై యాజమాన్యం కక్షసాధింపు చర్యలు మానుకోవాలని రేణుక అక్షర మహిళా మండలి అధ్యక్షురాలు పూనెం సరోజ డిమాండ్ చేశారు. అనారోగ్యంతో విధులకు హాజరు కాలేకపోయిన మహిళా కార్మికురాలిని ఉద్యోగం నుంచి తొలగించడం అన్యాయమని ఆమె విమర్శించారు. వెంటనే ఆమెను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, లేకపోతే ఎస్ఎంఎస్ ప్లాంట్ ఎదుట నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. కార్మికుల శ్రమను దోపిడీ చేస్తూ అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని, స్థానికులకు ఉపాధి కల్పించకుండా స్థానికేతరులకు ఉద్యోగాలు ఇస్తున్నారని ఆరోపించారు. ప్లాంట్‌లో జరుగుతున్న అక్రమాలను వెలికితీసి బట్టబయలు చేస్తామని హెచ్చరించిన ఆమె, పలువురు సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న మేనేజర్‌ను వెంటనే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు బొడ్డు సౌజన్య, ట్రెజరర్ ఎండి షబానా, ప్రధాన కార్యదర్శి రెడ్డిబోయిన రేణుక, కోరి శ్యామల, దేరంగుల సుజాత, కన్నాపురం వసంత, కన్నాపురం శైలజ, బాడిశ పార్వతి, లక్కింశెట్టి హేమలత, సౌజన్య దాకూరి తదితరులు పాల్గొన్నారు.

# 101 కిలోల డ్రై గంజాయి స్వాధీనం

- నలుగురు నిందితుల అరెస్ట్..
- కారు, ఐదు మొబైల్ ఫోన్లు సీజ్
- భద్రాచలం, ఖమ్మం మార్గంలో అక్రమ రవాణాకు పోలీసుల చెక్

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో జులై 25 అనంత జనశక్తి న్యూస్ :**

భద్రాచలం పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం మధ్యాహ్నం నిర్వహించిన వాహన తనిఖీల్లో పోలీసులు 101 కిలోల డ్రై గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరభద్రం ఫంక్షన్ హాల్ సమీపంలోని కూనవరం రోడ్డుపై పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ) ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో ఆంధ్రప్రదేశ్‌లోని మోతుగూడెం నుంచి కర్ణాటక రాష్ట్ర రాజధాని బెంగళూరుకు అక్రమంగా తరలిస్తున్న గంజాయిని గుర్తించారు. ఈ సందర్భంగా కర్ణాటక రిజిస్ట్రేషన్ నంబర్ KA03NR5892 గల మారుతి ఎర్టిగా కారుతో పాటు ఐదు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న నలుగురు నిందితులను అరెస్టు చేశారు. అరెస్టైన వారిలో కర్ణాటకలోని బెంగళూరు దక్షిణకు చెందిన సలీం పాషా (53), ఎం.డి. అర్బాజ్ హుస్సేన్ (22), బెంగళూరు గ్రామీణ జిల్లా నెలమంగలకు చెందిన ఎస్. గుల్జార్ (35), ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా నల్లమడకు చెందిన ఈ. రాజేంద్ర ప్రసాద్ (34) ఉన్నారు. ప్రాథమిక విచారణలో నిందితులు ఆంధ్రప్రదేశ్‌లోని మోతుగూడెం నుంచి భద్రాచలం-ఖమ్మం మార్గం గుండా బెంగళూరుకు రోడ్డు మార్గంలో గంజాయిని అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ దాడిలో సీఐ రహీమున్నీసా, ఎస్ఐ సీతారామరాజు, హెడ్ కానిస్టేబుల్ కరీమ్‌తో పాటు పోలీసు సిబ్బంది భద్రం, సీతారాం, రాకేష్, రవి పాల్గొన్నారు.



# పీకే ఓసీ–2 డిప్‌సైడ్ బ్లాక్ సింగరేణికే కేటాయించాలి

- జెన్కో లేదా ప్రైవేటుకు ఇస్తే తీవ్ర ప్రతిఘటన తప్పదు
- అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలతో కలిసి ఉద్యమం: ఏఐటీయూసీ

**మణుగూరు, జులై 25, అనంత జనశక్తి న్యూస్ :**

పీకే ఓసీ-2 డిప్‌సైడ్ బ్లాక్‌ను సింగరేణికే కేటాయించాలని, జెన్కో లేదా ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై. రాంగోపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం పీకే ఓసీ-2 గనిలో నిర్వహించిన ఏఐటీయూసీ గేట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మణుగూరు ఏరియా ఓసీ-2 పర్యటనకు వచ్చిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు మణుగూరు ప్రజలు, సింగరేణి కార్మికుల తరఫున వినతిపత్రం అందజేయడానికి ఉదయం నుంచి సాయంత్రం వరకు వేచి చూసినా అవకాశం కల్పించలేదని ఆయన విమర్శించారు. దీనిని డిప్‌సైడ్ బ్లాక్‌ను ఇతరులకు అప్పగించే కుట్రలో భాగంగానే భావిస్తున్నామని అన్నారు. సింగరేణి యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా గనిలోనే వేదిక ఏర్పాటు చేసి, కాంట్రాక్టర్లు, రాజకీయ నాయకులు, ఇతరులను నేరుగా గనిలోకి అనుమతించడం సరైన చర్య కాదని పేర్కొన్నారు. డిప్‌సైడ్ బ్లాక్‌ను జెన్కోకు అప్పగించే ఉద్దేశంతోనే వారిని గనిలోకి తీసుకువచ్చారని ఆరోపించారు. పీకే ఓసీ-2 డిప్‌సైడ్ బ్లాక్‌లో అత్యంత నాణ్యమైన బొగ్గు నిల్వలు ఉన్నాయని, ఈ బ్లాక్‌లో సుమారు 115 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని తెలిపారు. దీనిని ఇతర సంస్థలకు అప్పగిస్తే మైన్ బౌండరీ కింద భద్రతా పరిమితుల కారణంగా కేవలం 30 మిలియన్ టన్నుల బొగ్గు మాత్రమే వెలికితీయగలరని, మిగిలిన 85 మిలియన్ టన్నుల బొగ్గు దేశ సంపదగా వృథా అవుతుందని అన్నారు. అదే సింగరేణికి కేటాయిస్తే మొత్తం బొగ్గు నిల్వలను వినియోగించుకునే అవకాశం ఉంటుందని వివరించారు. జెన్కోకు బొగ్గు తవ్వకాల అనుభవం లేదని, అందుకే తాడిచర్ల బ్లాక్-1ను ఏఎంఆర్ (AMR) అనే ప్రైవేటు సంస్థకు అప్పగించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. మణుగూరు డిప్‌సైడ్ బ్లాక్ విషయంలో కూడా ఇదే తరహా కుట్ర జరుగుతోందని ఆరోపించారు. డిప్‌సైడ్ బ్లాక్‌ను సింగరేణికి కేటాయించకపోతే మణుగూరు భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని, ఏరియాలో పనిచేస్తున్న సుమారు 2,600 మంది శాశ్వత కార్మికులు, 3,200 మంది కాంట్రాక్టు కార్మికులు, ఓబీ కార్మికులు, వ్యాపారులు, విద్యాసంస్థలు తీవ్రంగా ప్రభావితమవుతాయని అన్నారు. ఒకప్పుడు పేపర్ బోర్డు కోల్పోయిన కమలాపురం పరిస్థితి మణుగూరుకు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణిని జేబు సంస్థగా ఉపయోగించుకుంటోందని, సంస్థకు చెల్లించాల్సిన సుమారు ₹56 వేల కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 4న జరగనున్న వేలంలో పీకే ఓసీ-2 డిప్‌సైడ్ బ్లాక్‌ను సింగరేణికి కేటాయించకపోతే రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అవసరమైతే అన్ని రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు, ప్రజలను కలుపుకుని ఉద్యమాలు చేపడతామని స్పష్టం చేశారు. ఈ విషయంలో మణుగూరు ఎమ్మెల్యే జోక్యం చేసుకుని బ్లాక్‌ను సింగరేణికే కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ సమావేశంలో ఏఐటీయూసీ వైస్ ప్రెసిడెంట్ మల్లెల రాంనర్సయ్య, అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి మేకల ఈశ్వరరావు, జాయింట్ సెక్రటరీ పుల్లారావు, ఆఫీస్ బేరర్లు సురేందర్‌రావు, ఫిట్ సెక్రటరీలు శనిగరపు కుమారస్వామి, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ సుదీప్, బి. రవికుమార్, అబ్రహం, నాగుల సతీష్, బత్తుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.




ఆదివారం | రంగారెడ్డి
26.07.2026
అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం





# స్నానం చేసే నీటిలో కొద్దిగా ఇప్పుడు చెప్పే పదార్థాన్ని కలపండి, బాడీ పెయిన్స్ తగ్గడమే కాదు ఎన్నో సమస్యలు దూరం

ప్రజెంట్ సిట్యువేషన్ ఎలా ఉందంటే ప్రతీ ఒక్కరూ కూడా లైఫ్‌లో స్ట్రెస్‌గా ఫీల్ అవుతున్నారు. దీంతో ఊరికే అలసిపోవడం, బాడీ పెయిన్స్ వంటివి కామన్ అయిపోయాయి. దీంతో ప్రతీ చిన్న విషయానికే నొప్పి మందులు తీసుకుంటున్నారు. కానీ, అలా కాకుండా కొన్ని సహజ పద్ధతులని ఫాలో అయితే మెడిసిన్ వాడకుండానే నొప్పులని తగ్గించుకోగలుగుతారు. అంటూ సహజ పద్ధతుల్లో ఉప్పు నీటి స్నానం ఒకటి. సముద్రపు ఉప్పు నీటిని స్నానం చేసే నీటిలో కలిపి ఆ నీటితో స్నానం చేసి చూడండి. వచ్చే లాభాలు అన్నీ ఇన్నీ కావు.



**సముద్రపు ఉప్పు అంటే**

సముద్రపు ఉప్పు అంటే సముద్రంలోని నీటిని ఎండబెట్టి ఈ ఉప్పని తయారుచేస్తారు. ఇందులో మెగ్నీషియం, కాల్షియం, పొటాషియం, జింక్ వంటి ఖనిజాలు ఎక్కువగా ఉంటాయి. ఇవి మన చర్మం, కండరాలు, కీళ్ళకి చాలా మంచివి. ఈ నీటితో స్నానం చేస్తే ఎన్నో ఎన్నెన్నో లాభాలు కూడా ఉన్నాయి.

**చర్మానికి మేలు**

సముద్రపు నీటితో స్నానం చేయడం వల్ల చర్మానికి మేలు జరుగుతుంది. ఇది చనిపోయిన చర్మ కణాలని తొలగించి కొత్త కణాలు ఏర్పడేలా చేస్తాయి. చర్మాన్ని హైడ్రేట్‌గా, మృదువుగా ఉండేలా చేస్తాయి. స్కిన్ ప్రాబ్లమ్స్‌తో బాధపడేవారు ఈ నీటితో స్నానం చేస్తే చాలా మంచిది. ఎలాంటి మెడిసిన్ వాడకుండానే స్కిన్ చక్కగా మెరుస్తుంది.



**బాడీ పెయిన్స్**

రోజంతా పనిచేయడం, ముఖ్యంగా కూర్చొని చేసే పనిలో 8 నుండి 9 గంటల పనిచేయడం వల్ల శరీర దృఢత్వం, కండరాల నొప్పులు పెరుగుతాయి. నొప్పి నివారణ మందులకి బదులుగా, ఉప్పు నీటితో స్నానం చేయడం వల్ల ఈ నొప్పులు తగ్గుతాయి. దీని వల్ల రక్తప్రసరణ పెరుగుతుంది. కండరాల నొప్పులు తగ్గుతాయి.ముఖ్యంగా, అలసిన పాదాలకి ఉపశమనం లభిస్తుంది.



**ఒత్తిడి తగ్గేందుకు**

ఉప్పు నీటితో స్నానం చేయడం వల్ల బాడీ మాత్రమే కాదు, మనసు కూడా రిలాక్స్ అవుతుంది. గోరువెచ్చని ఉప్పు నీటితో స్నానం చేస్తే ఒత్తిడి తగ్గుతుంది. మంచి నిద్ర వస్తుంది. పడుకునే ముందు, ఇలా నీటిలో ఉప్పు కలిపి స్నానం చేస్తే మంచి రిలాక్స్‌గా ఉంటుంది.

**ఎలా చేయాలి?**

- ఓ టబ్‌లో వేడి నీరు నింపండి.
- అందులో పావు కప్పు నుండి 2 కప్పుల వరకూ సముద్రపు ఉప్పు వేయండి.
- నీరు గోరువెచ్చగా అయ్యేవరకూ అలానే ఉంచితే ఉప్పు కరుగుతుంది. తర్వాత 15 నుంచి 20 నిమిషాలు నీటిలో కూర్చోండి.
- ఆ వీలు లేకపోతే మెల్లిగా నీరు పోసుకుంటూ ఎక్కువసేపు స్నానం చేయండి. తర్వాత మాయిశ్చరైజర్ రాయండి.
- రెగ్యులర్‌గా ఇలా చేసి చూడండి. మంచి రిజల్ట్స్ ఉంటాయి. మీ స్కిన్‌పై ఏవైనా గాయాలు, ఇన్ఫెక్షన్స్, అలర్జీలు ఉంటే ఉప్పు నీటితో స్నానం చేయొద్దు. ఇలా వారానికి 2 నుండి 3 సార్లు చేస్తే చాలు.

# పాదాల పగుళ్ళు పగులుతున్నాయా, ఇప్పుడు చెప్పేవి రాస్తే 7 రోజుల్లోనే కోమలంగా మారతాయి





పాదాల పగుళ్ళు ఉంటే చాలా సమస్యగా ఉంటుంది. నడవలేరు. ముఖ్యంగా చెప్పులు లేక నడిస్తే మరీ ఇబ్బందిగా ఉంటుంది. సమస్య రాగానే మట్టిలో నడిచినా, బట్టలు పిండినా కూడా సమస్య మరింత పెరుగుతుంది. కాబట్టి, దీనిని తగ్గించుకోవాలి. ఆయుర్వేదంలో ప్రతీ సమస్యకి పరిష్కారం ఉన్నట్లుగానే కాలి పగుళ్ళకి కూడా మంచి చిట్కాలు ఉన్నాయి. కొన్ని నూనెలతో ఆయుర్వేద పద్ధతిలో మసాజ్ చేస్తే గనుక 7 రోజుల్లోనే కాలి పగుళ్ళు తగ్గి పాదాలు సాఫ్ట్‌గా మాతాయి. కోమలంగా అనిపిస్తాయి. బయట కొనే క్రీమ్స్ కంటే ఎన్నో రెట్లు ఇవి ఎఫెక్టివ్‌గా పనిచేసి కాలి పగుళ్ళని తగ్గిస్తాయి. పైగా వీటి వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ కూడా ఉండవు. నేచురల్‌గానే బేబి సాఫ్ట్ పాదాలు మీ సొంతమవుతాయి. ఇంట్లో వాడే కొన్ని నూనెల్ని వాడి పాదాల పగుళ్ళని చాలా వరకూ తగ్గించుకోవచ్చు శ్వేతా షా ప్రకారం, వీటిని ఎలా వాడాలో తెలుసుకోండి.

**కావాల్సిన పదార్థాలు**

కావాల్సిన పదార్థాలు
- నువ్వుల నూనె 90 మి.లీ
- వేప నూనె 30 మి.లీ
- అలోవెరా జెల్ 1 టీస్పూన్
- పసుపు 1 టీస్పూన్
- చందనం పొడి 1 టీస్పూన్
- వేప పొడి 1 టీస్పూన్

**ఏం చేయాలి?**

- పైన చెప్పిన పదార్థాలన్నీ ఓ గిన్నెలో కలపాలి.
- దీనిని డబుల్ బాయిల్ మెథడ్‌లో ఓ సారి వేడి చేయండి.
- పడుకునే ముందు కాళ్ళని శుభ్రంగా కడుక్కోవాలి.
- తర్వాత తయారుచేసి పెట్టుకున్న మిశ్రమాన్ని రాసి చక్కగా మసాజ్ చేయాలి.
- తర్వాత కాటన్ సాక్స్‌లు వేసుకుని రాత్రంతా అలానే ఉంచాలి.
- ఇలా రెగ్యులర్‌గా చేస్తే చాలా వరకూ కాలి పగుళ్ళు తగ్గుతాయి.

**లాభాలు**

- వీటిలోని గుణాలు పాదాలని లోతుగా మాయిశ్చరైజ్ చేసి కోమలంగా మారుస్తాయి.
- ఇందులోని యాంటీ మైక్రోబయల్ ప్రొటెక్షన్ స్కిన్‌ని త్వరగా రిపేర్ చేస్తుంది.
- దీనిని రెగ్యులర్‌గా వాడడం వల్ల మృదువైన పగుళ్ళు లేని పాదాలు మీ సొంతమవుతాయి. ఇందులో వాడిన నువ్వులనూనె, వేపపొడి, అలోవెరా జెల్ వంటివన్నీ కూడా చర్మ సమస్యల్ని దూరం చేస్తాయి. దీంతో కాలి పగుళ్ళని తగ్గించి పాదాలని సాఫ్ట్‌గా మారుస్తాయి.





**తులసితో కూడా**


కాలి పగుళ్ళు తగ్గేందుకు తులసిని కూడా వాడొచ్చు. దీనికోసం
- తులసి పేస్ట్
- అలోవెరా జెల్
- కర్పూరం

వీటన్నింటిని బాగా కలిపి పాదాలకి మసాజ్ చేయండి. రెగ్యులర్‌గా చేస్తే మీ పాదాల పగుళ్ళు చాలా వరకూ తగ్గుతాయి.



**పాదాలు పగులకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

పగులకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు
- దీనికోసం రెగ్యులర్‌గా పాదాలను 15 నిమిషాల పాటు గోరువెచ్చని నీటిలో నానబెట్టండి.
- తర్వాత వాటిని ప్యూమిస్ రాయితో స్క్రబ్ చేయండి. దీంతో డెడ్ స్కిన్ సెల్స్ దూరమవుతాయి.
- తర్వాత హార్ష్, సువాసనలు ఉండే క్రీమ్స్ సోప్స్ బదులు కొబ్బరినూనె, ఆలివ్ ఆయిల్, బాదం ఆయిల్ రాయండి.
- రాత్రుళ్ళు రాసి మసాజ్ చేసి సాక్స్ వేసుకోండి. ఇలా చేస్తుంటే పాదాలు చాలా వరకూ సాఫ్ట్‌గా మారతాయి.



# ట్రోల్ చేస్తున్నావా.. పొగుడుతున్నావా.. నాగచైతన్య పోస్ట్‌కు శోభిత రియాక్షన్



నాగచైతన్య, శోభిత దంపతులు సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటూ నెటిజన్‌లను అలరిస్తుంటారు. తాజాగా నాగచైతన్య తన భార్య శోభిత వంట చేసిన ఫొటోను సోషల్ మీడియాలో పంచుకోగా.. ఆమె ఫన్నీ రిప్లై ఇచ్చారు.

'పెళ్లయిన దాదాపు రెండేళ్లకు నా భార్య నా కోసం వంట చేసింది. బహుశా.. ఈ రోజు నేను ఏదో మంచి పనే చేసి ఉంటాను' అని నాగచైతన్య ఇన్‌స్టాలో శోభితా ఫొటోను షేర్ చేశారు. దీనికి శోభిత స్పందిస్తూ 'నువ్వు నన్ను ట్రోల్ చేస్తున్నావా.. లేక పొగుడుతున్నావా' అంటూ ఫన్నీ ఎమోజీని జోడించారు.

ఇక వీరి సినిమాల విషయానికొస్తే.. 'తండేల్' విజయం తర్వాత చైతన్య ప్రస్తుతం 'విరూపాక్ష' ఫేమ్ కార్తీక్ దండు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న మైథలాజికల్ చిత్రం 'వృషకర్మ'లో నటిస్తున్నారు. ఇక శోభిత క్రైమ్ థ్రిల్లర్ 'చీకటిలో 'లో కనిపించారు. ప్రస్తుతం పా. రంజిత్ దర్శకత్వంలో వస్తున్న తమిళ చిత్రం 'వెట్టువం' విడుదల కోసం ఎదురుచూస్తున్నారు.

# హాలీవుడ్‌కు దీటుగా రామాయణ ప్రపంచం



నితేశ్ తివారీ దర్శకత్వంలో భారీ హంగులతో రూపుదిద్దుకుంటున్న సినిమా 'రామాయణ'. శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్ నటిస్తున్నారు. శుక్రవారం విడుదల కావాల్సిన ఈ సినిమా ట్రైలర్ చివరి నిమిషంలో వాయిదా పడింది. "అంతర్జాతీయ స్థాయిలో విడుదల చేయాలని భావించి ట్రైలర్‌ని వాయిదా వేస్తున్నాం. హాలీవుడ్ సినిమాలకు దీటుగా 'రామాయణ' ప్రపంచ నలుమూలలకు వెళ్తుంద"ని పేర్కొంటూ ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు నిర్మాత నమిత్ మల్హోత్రా. ఈ సినిమా ప్రచార కార్యక్రమాల్లో భాగంగా అమెరికాలో జరుగుతోన్న శాన్ డియాగో కామిక్-కాన్ 2026 వేడుకల్లో చిత్రబృందం పాల్గొంది. ఈ సందర్భంగా వేడుకలో రణ్‌బీర్ మాట్లాడుతూ.. "ఈ సినిమాలో అవకాశం వచ్చినప్పుడు నాలో చాలా భయం, సందేహం ఉండేవి. 'నేను ఇది చేయగలనా, నాకు అంత సామర్థ్యం ఉందా?' అనిపించేది. కానీ ఆ సందేహం చాలా త్వరగానే కృతజ్ఞతా భావంగా మారింది. ఇదొక వరం. జీవితంలో ఒక్కసారి మాత్రమే లభించే అవకాశం. తరతరాలుగా శ్రీరాముడు ఎంతో మందికి ఆత్మ రక్షకుడిగా ఉన్నారు. ధైర్యం, కరుణ, క్షమ, ధర్మం లాంటి వాటికి ఆయన ప్రతీకగా నిలుస్తారు. అలాంటి లక్షణాలకు ప్రాతినిధ్యం వహించే అవకాశం రావడం చాలా గొప్ప విషయం. దీనికి చాలా విశ్వాసం, నమ్మకం, నిజాయతీ అవసరమని ప్రారంభంలోనే అర్థం చేసుకున్నా.ఈ కథను ధ్యమైనంత వాస్తవికంగా చెప్పాలన్నదే మా నటీనటులు, సిబ్బందిల ఉన్నతమైన ఉద్దేశం" అన్నారు.

యశ్ మాట్లాడుతూ.. "ఈ ప్రపంచంలో ఎవరూ వచ్చి 'నేను శ్రీరాముడి పాత్ర పోషించగలన'ని చెప్పలేరు. ఈ పాత్ర పోషించడం అంత సులభం కాదు. రణ్‌బీర్ గొప్పగా నటించారు. సినిమా చూసినప్పుడు అతని నిబద్ధత కనిపిస్తుంద"ని అన్నారు. రెండు భాగాలుగా విడుదల అవనున్న ఈ సినిమా మొదటి భాగం దీపావళికి థియేటర్లలోకి రానుంది.



# తొలి హీరోగా విజయ్ హ్యాట్రిక్ రికార్డు..

అగ్ర కథానాయకుడు విజయ్ నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'జన నాయగన్' బాక్సాఫీస్ వద్ద రికార్డు సృష్టించింది. ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ ప్రీసేల్‌లో ఏకంగా 10 లక్షల టికెట్లు అమ్ముడైనట్లు నిర్మాణ సంస్థ తెలిపింది. దీంతో వరుసగా మూడు సినిమాలకు ప్రీసేల్ బుకింగ్స్‌లోనే వన్ మిలియన్ మార్క్ అందుకున్న తొలి భారతీయ హీరోగా విజయ్ నిలిచారు. గతంలో విజయ్ నటించిన 'వారిసు', 'ది గోట్' చిత్రాలు కూడా విడుదలకు ముందే 10 లక్షలకు పైగా టికెట్ల విక్రయాలతో ఈ ఘనత సాధించగా.. ఇప్పుడు 'జన నాయగన్'తో విజయ్ హ్యాట్రిక్ కొట్టారు.

'జన నాయగన్' కథంటేంటే..

దళపతి వెట్రి కొండాన్ (విజయ్) ఓ ఖైదీగా జైలు జీవితాన్ని గడుపుతుంటాడు. ఓ వ్యాపారవేత్తని అంతం చేయడానికి జైలుపై పడిన ముఠాని ఎదురించి నిజాయతీ కలిగిన జైలు అధికారి (గౌతమ్ మేనన్) దృష్టిని ఆకర్షిస్తాడు. ఆ అధికారి సాయంతో ఆగస్టు 15న క్షమాభిక్ష కింద బయటకొస్తాడు వెట్రి. అంతలోనే ఆ అధికారి ఓ ప్రమాదంలో మరణిస్తాడు. దాంతో అతడి కుమార్తె విజ్జి (మమిత బైజు)ని పెంచే బాధ్యతని వెట్రి తన భుజాన వేసుకుంటాడు. చిన్నప్పుడు తల్లి దారుణ హత్యని కళ్లారా చూసిన విజ్జి ప్రతి చిన్న విషయానికీ భయంతో వణికిపోతుంటుంది. ఆమెను ధైర్యవంతురాలిగా మార్చి, సైన్యంలో చేర్పించాలని నిర్ణయించుకుంటాడు. అందుకోసం శిక్షణ కూడా ఇప్పిస్తుంటాడు. ఇంతలో జాన్ హిమ్లర్ (బాబీ దేవోల్) విజ్జిని లక్ష్యంగా చేసుకుని ఆమెని అంతం చేయాలని తన ముఠాని పంపుతాడు. ఇంతకీ విజ్జిని జాన్ హిమ్లర్ ల

# పోలియో కాటేసినా.. రిక్షా నడిపి: కామన్వెల్త్‌లో భారత్‌కు తొలి పతకం




ఈ ఏడాది కామన్వెల్త్ గేమ్స్‌లో భారత్ పతకాల ఖాతా తెరిచింది. గ్లాస్గోలో జరిగిన హెవీవెయిట్ పారా పవర్ లిఫ్టింగ్ ఫైనల్లో భారత పారా అథ్లెట్ ఝుండూ కుమార్ కాంస్య పతకం సాధించి దేశానికి తొలి పతకాన్ని అందించాడు. 190 కిలోల బరువును ఎత్తిన ఝుండూ 130.9 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాడు. దీంతో కామన్వెల్త్ గేమ్స్ పతకాల పట్టికలో భారత్ బోణీ కొట్టింది.

ఫైనల్లో తొలి ప్రయత్నంలో 181 కిలోల బరువును సునాయాసంగా ఎత్తిన ఝుండూ కుమార్, రెండో ప్రయత్నంలో 190 కిలోలను లిఫ్ట్ చేశాడు. ఈ ప్రదర్శనతో కొంతసేపు పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచి స్వర్ణ పతకంపై ఆశలు రేకెత్తించాడు. కానీ, చివరి ప్రయత్నంలో 196 కిలోల బరువును ఎత్తేందుకు ప్రయత్నించి విఫలమవడంతో కాంస్యంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అయితే, అంతర్జాతీయ క్రీడోత్సవంలో పోడియంపైకి చేరి భారత జెండాను రెపరెపలాడించిన ఝుండూ ప్రయాణం.. నల్లేరుపై నడకేం కాదు. పుట్టుకతోనే వైకల్యం కాటేసినా.. దాన్ని ఎదిరించి ఇప్పుడు దేశానికి పతకం అందించాడు.

ఎవరీ ఝుండూ కుమార్.?

29 ఏళ్ల ఝుండూ.. బిహార్‌లోని నలంద జిల్లా హర్నౌత్ గ్రామంలో ఓ పేద కుటుంబంలో జన్మించాడు. తండ్రి కూరగాయలమ్ముతూ కుటుంబాన్ని పోషించేవారు. చిన్నతనంలోనే పోలియో బారిన పడిన ఝుండూ.. ఏనాడూ దాన్ని తన ఎదుగుదలకు అడ్డంకిగా చూడలేదు. క్రీడల మీద ఆసక్తితో షార్ట్‌పుట్, డిస్కస్‌త్రో వంటి ఆటలపై దృష్టిపెట్టాడు. అందులో రాష్ట్ర స్థాయి పతకాలు సాధించాడు. ఈ క్రీడలకు సన్నద్ధమవడం కోసం జిమ్‌లో ట్రైనింగ్ తీసుకున్నాడు. ఆ సమయంలోనే పవర్‌లిఫ్టింగ్‌పై అతడికి ఆసక్తి పెరిగింది. దీంతో పారా పవర్‌లిఫ్టింగ్ కోసం శిక్షణ ప్రారంభించాడు.

రిక్షా తొక్కి..

ఆటల పోటీల్లో పాల్గొనడం అంటే చిన్న విషయం కాదు. శిక్షణ ఎంత అవసరమో పోషకాహారం కూడా అంతే ముఖ్యం. అయితే, ఝుండూ ఆర్థిక పరిస్థితి కారణంగా న్యూట్రిషన్ ఫుడ్ తీసుకోవడం సాధ్యపడేది కాదు. దీంతో స్థానిక మార్కెట్లలో కూరగాయాలు విక్రయించేవాడు. ఆ సమయంలో వీల్‌ఛెయిర్ లేకపోవడంతో 20 కిలోమీటర్లు కష్టంగా ప్రయాణించాల్సి వచ్చేది. కొంతకాలానికి ఆ పనిమానేసి తెలిసిన మిత్రుల వద్ద అప్పు చేసి ఈ-రిక్షా కొనుక్కున్నాడు. దాన్ని నడపగా వచ్చిన డబ్బును తన శిక్షణ కోసం వెచ్చించేవాడు.

05 కిలోలు ఎత్తి..

ఝుండూ పాల్గొన్న తొలి జాతీయ ఛాంపియన్‌షిప్‌లో విజయం సాధించలేకపోయాడు. అయితేనేం.. పారాలింపిక్ కాంస్య పతక విజేత రాజిందర్ సింగ్ దృష్టిలో పడ్డాడు. అతడి ప్రతిభను గుర్తించిన రాజిందర్.. ఝుండూను గాంధీనగర్‌లోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌కు తీసుకెళ్లాడు. దీంతో అతడి దశ మారింది. 2025లో జరిగిన జాతీయ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఏకంగా 205 కిలోల బరువులెత్తి.. ఝుండూ సరికొత్త జాతీయ రికార్డ్ సాధించాడు. ఆ తర్వాత కొద్ది నెలలకే ఖేలో ఇండియా పారాగేమ్స్‌లో 206 కిలోలు ఎత్తి మరో రికార్డు సృష్టించాడు. కామన్వెల్త్ గేమ్స్‌కు ముందు గతేడాది జరిగిన బీజింగ్ వరల్డ్ కప్, ఈ ఏడాది ఆరంభంలో జరిగిన ఏషియాన్, ఓషియానా ఛాంపియన్‌షిప్‌ల్లో కాంస్యం సాధించాడు.

# వైభవ్ సూర్యవంశీ ఇక బౌలర్‌గా కూడా..!



యువ సంచలనం వైభవ్ సూర్యవం ని భవిష్యత్తులో బౌలర్‌గా కూడా తీర్చిదిద్దే ఆలోచనలో టీమ్ఇండియా మేనేజ్‌మెంట్ ఉన్నట్లు తెలుస్తోంది. జింబాబ్వేతో రెండో టీ20కి ముందు మీడియాతో మాట్లాడిన బౌలింగ్ కోచ్ సునీల్ జోషి ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రస్తుతం వైభవ్ బ్యాటింగ్‌పైనే పూర్తి దృష్టి పెట్టామని, అతడు అసాధారణ ప్రతిభ కనబరుస్తున్నాడని కొనియాడారు. తొలి టీ20లో 18 బంతుల్లో 50 పరుగులు చేసి అంతర్జాతీయ క్రికెట్‌లో ఈ ఘనత సాధించిన అత్యంత పిన్న వయస్కుడిగా నిలిచాడని పేర్కొన్నారు.

వైభవ్ సూర్యవంశీ బ్యాటింగ్‌తో పాటు అతని బౌలింగ్ నైపుణ్యాలపైనా ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు జోషి వెల్లడించారు. బౌలింగ్‌కు అవకాశం దొరికినప్పుడల్లా బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ అతనితో కలిసి పని చేస్తానన్నారు. బౌలింగ్‌లో మంచి పురోగతి కనిపిస్తే.. వెంటనే దానిపై దృష్టి పెడతామని తెలిపారు.

మరోవైపు.. సూర్యాంశ్ షెడ్గేను హార్దిక్ పాండ్యా , శివమ్ దుబె(తో పోల్చడం సరికాదన్నారు. హార్దిక్, శివమ్ ఇప్పటికే జట్టులో తమ స్థానాలను స్థిరపరుచుకున్నారని, సూర్యాంశ్ ఇప్పడే ఎదుగుతున్న యువ ఆల్‌రౌండర్ అని పేర్కొన్నారు. టీ20 ఫార్మాట్‌కు అనుగుణంగా సూర్యాంశ్‌ను తీర్చిదిద్దేందుకు జట్టు పూర్తి మద్దతు ఇస్తుందని వెల్లడించారు. అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హర్ష్ దుబె వంటి ఆటగాళ్లు కూడా బౌలింగ్ చేయగల సామర్థ్యం కలిగిన వారేనని, టీ20 క్రికెట్‌లో అదనపు బౌలింగ్ ఆప్షన్లు ఉండటం జట్టుకు ఎంతో ఉపయోగపడుతుందని జోషి అభిప్రాయపడ్డారు.

# టీమ్ఇండియా వైఫల్యాలపై.. వచ్చే నెలలో సమీక్ష: బీసీసీఐ

ప్రస్తుతం జింబాబ్వేతో టీ20 సిరీస్ ఆడుతున్న టీమ్ఇండియా.. వచ్చే నెలలో శ్రీలంక పర్యటనకు వెళ్లనుంది. ఆగస్టు 15 నుంచి ఆతిథ్య జట్టుతో రెండు టెస్టు మ్యాచ్‌లు ఆడనుంది. ఈ సిరీస్ కోసం జులై 28న భారత జట్టును ప్రకటిస్తామని బీసీసీఐ కార్యదర్శి దేవ్‌జిత్ సైకియా వెల్లడించారు. ఐర్లాండ్, ఇంగ్లాండ్, జింబాబ్వే పర్యటనల్లో భారత జట్టు ఆటతీరుపై ఆగస్టు ఆరంభంలో సమీక్ష నిర్వహిస్తామని ఆయన తెలిపారు. టీమ్ఇండియా సహాయక సిబ్బందిలో కొంతమంది కాంట్రాక్టు ముగిసిందని, దానిపై కూడా సమీక్షా సమావేశంలో చర్చిస్తామని సైకియా పేర్కొన్నారు. ఇటీవల జరిగిన రెండు టీ20 మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్‌కు ఐర్లాండ్ షాకిచ్చిన సంగతి తెలిసిందే. తర్వాత ఇంగ్లాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లోనూ భారత్ వైట్‌వాష్‌కు గురైన సంగతి తెలిసిందే. ఇంగ్లిష్ జట్టుతో మూడు వన్డేల సిరీస్‌లో తొలి మ్యాచ్‌లో గెలిచిన భారత్.. తర్వాత రెండు మ్యాచ్‌ల్లో ఓటమిపాలై సిరీస్‌ను చేజార్చుకుంది. ఈ నేపథ్యంలో భారత జట్టు ప్రదర్శనపై బీసీసీఐ పెద్దలు సమీక్ష నిర్వహించనున్నారు.



PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT FLAT NO 402,4 FLOOR RADHAMADHAV NILAYAM,BESIDE SURYAVAMSHIGARDEN2,SURYAVAMSHI COLONY, PEDDA AMBERPET., RANGAREDDY, TELANGANA 501505. EDITOR : SHANKARAGALLU VENKATESULU. Printing Press M/S. TRIPURA PUBLICATIONS HOUSE NO.: 58518, REVENUE WARD NO: 05, ASHOK NAGAR COLONY, KAMAREDDY (TOWN & POST), MANDAL, TELANGANA 503111. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : TGTEL/26/A4945